

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 25-03-2026 | సంపుటి - 27 | సంచిక -302 | రూ : 4 | పేజీలు: 8


# దక్షిణాదిపై '50 శాతం' కుట్ర

- అదే జరిగితే ఈ ప్రాంతంతో అవసరం ఉండదు
- ఉత్తరాదిలోని 4 రాష్ట్రాల ఎంపీ సీట్లతో కేంద్రంలో అధికారంలోకి రావొచ్చు
- డీలిమిటేషన్‌పై పోరాటానికి సిద్ధం కావాలి
- ఓ టీవీ ఛానెల్ చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి



దిల్లీ: దేశంలో జనాభా సంఖ్య ఆధారంగా ఎంపీ సీట్లను 50 శాతం పెంచుతుండటం వెనుక కుట్ర దాగి ఉందని, అదే జరిగితే దక్షిణ భారతంతో సంబంధం లేకుండా ఉత్తర భారతంలోని నాలుగు రాష్ట్రాల సీట్లతో కేంద్రంలో అధికారంలోకి రావొచ్చని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దిల్లీలో మంగళవారం ఓ టీవీ ఛానెల్ ఏర్పాటు చేసిన చర్చ సందర్భంగా ఆయన నియోజకవర్గాల పునర్విభజన, 50 శాతం ఎంపీ సీట్ల పెంపు తదితర అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఎంపీ స్థానాల విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం ఉంది. అంతే స్థాయిలో సీట్ల పెంపు జరగాలి. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్రం అన్యాయం చేస్తోంది. వివక్ష చూపుతోంది. దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్‌పై పోరాటానికి సిద్ధం కావాలి. 50 శాతం సీట్ల పెంపు ఏ లెక్క ప్రకారం జరుగుతుంది? అలా సీట్ల పెంపు అనేది దక్షిణాది రాష్ట్రాలపై ఫైనల్ బుల్లెట్. ఈ పద్ధతిలో తమిళనాడు, పుదుచ్చేరిలో ఇప్పుడున్న 40 సీట్లు 60 అవుతాయి. అదే యూపీలో 80 సీట్లు 120 అవుతాయి. అలా మధ్యప్రదేశ్, యూపీ,

తరువాయి 2లో



## మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం

2లో

- మంచిరేవుల వీరభద్రస్వామి గుడి వద్ద నిర్మాణం
- 28న సీఎం రేవంత్ శంకుస్థాపన
- తర్వాత దశలో చర్చి, మసీదు, గురుద్వారా
- నదిలో 100 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహం
- మత సామరస్యానికి ప్రతీకగా అభివృద్ధి

## పటేల్ స్ఫూర్తితో ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తారా?

- విగ్రహం పెట్టడమే కాదు ఆయన ఆదర్శాలను పాటించాలి :
- అసెంబ్లీలో బీజేపీకి ఉప ముఖ్యమంత్రి భట్టి డిమాండ్
- రూ.197 లక్షల కోట్ల అప్పుల్లో మోడీ చేసిందే రూ.140 లక్షల కోట్లు
- రాష్ట్రాలు అభివృద్ధి చెందకుండా వికసిత్ భారత్ ఎలా సాధ్యం
- ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చిన కేంద్రం

2లో





## ఇరాన్ చమురు వచ్చేస్తోంది!

- ప్రత్యామ్నాయాల్లో భారత్ దూకుడు
- బ్రెంట్ కంటే అధిక ధరకు
- 5 మి. బ్యారెళ్లు కొనుగోలు చేసిన రిలయన్స్


ఇరాన్ : మనదేశ చమురు అవసరాల్లో 88% దిగుమతులే తీరుస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడి ప్రారంభించాక, ఉద్రిక్తతలు గల్ఫ్ దేశాలకు విస్తరిస్తున్నాయి. ప్రపంచ చమురు రవాణాలో 20% వాటా కలిగిన హర్మూజ్ జలసంధిలో ఆటంకాలు ఏర్పడటంతో, చమురు రంగం సంక్షోభంలో పడింది. చమురు, ఎల్‌పీజీ, సీఎన్‌జీ సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, ధరలు పెరిగిపోతున్నాయి. ప్రపంచ దేశాలకు ఈ సెగ తగలడంతో, చమురు ధరలు తగ్గిద్దామన్న ఉద్దేశంతో ఇరాన్ చమురు కొనుగోళ్లపై ఆంక్షలను అమెరికా తాత్కాలికంగా (30 రోజుల పాటు) ఎత్తివేసింది. అంతక్రితమే రష్యా చమురు కొనుగోలు చేయడానికీ అమెరికా అనుమతులు ఇచ్చింది. ఆ వెంటనే భారతీయ రిఫైనరీలు 40 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును కొనుగోలు చేసి పెట్టుకున్నాయి. చమురుతో పాటు వంట గ్యాస్(ఎల్‌పీజీ) దిగుమతి అవసరాలూ మనదేశానికి అధికంగా ఉన్నాయి.


తరువాయి 2లో

## ట్రంప్ నోట చర్చల మాట .. ఆగని బాంబుల మోత

- ఇరాన్‌పై భారీగా వైమానిక దాడులు
- గల్ఫ్, ఇజ్రాయెల్‌లపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించిన ఇరాన్
- పర్షియన్ గల్ఫ్‌కు వేల మంది అమెరికా సైనికులు
- ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా బాఘెర్
- 100 డాలర్లు దాటిన చమురు - కొన్ని దేశాల్లో ఇంధన అత్యయిక స్థితి

2లో






## జిహాద్ కోసం 'అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్'

- ఏర్పాటు చేసిన విజయవాడ వాసి రహమతుల్లా షరీఫ్
- మిర్జా సొహైల్ బేగ్, మహమ్మద్ దానిష్‌లతో కలిసి కార్యకలాపాలు
- అల్‌ఖైదా, ఐసిస్‌లతో సంప్రదింపులు
- దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ విస్తరణ

## మారనున్న రాజకీయ ముఖచిత్రం

- నియోజకవర్గాల పునర్విభజనతో కీలక మార్పులు
- ఓటర్ల సంఖ్యలో అసమానతల్ని సరిచేయొచ్చు
- కొత్త నాయకత్వానికి అవకాశం
- మహిళలకు చట్టసభల్లో విస్తృత ప్రాధాన్యం
- మంత్రుల సంఖ్యా పెరుగుదల!




2లో

## ఎంత చెప్పినా మారరా?

- సీఎం చంద్రబాబు హెచ్చరించే పరిస్థితి ఎందుకొస్తోంది
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి: కొందరు ప్రజాప్రతినిధులపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయని, ఎంత చెప్పినా వారిలో మార్పు రావట్లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోపణలపై సీఎం చంద్రబాబు హెచ్చరించే వరకు పరిస్థితిని ఎందుకు తెచ్చుకుంటున్నారని నిలదీశారు. మంగళవారం విజయవాడలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలతో సమావేశం

తరువాయి 2లో

# ట్రంప్ నోట చర్చల మాట .. ఆగని బాంబుల మోత

దుబాయ్: అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో దాడుల ఉద్ధృతి తీవ్రమైంది. యుద్ధం ముగింపునకు చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నా.. బాంబుల మోత ఏ మాత్రం తగ్గలేదు. చర్చలు జరుగుతున్నాయన్న వాదనలను ఇరాన్ ఖండించింది. 25వ రోజైన మంగళవారం అటు ఇజ్రాయెల్, ఇటు ఇరాన్ బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. గల్ఫ్ దేశాలతోపాటు ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. మరోవైపు పర్షియన్ గల్ఫ్ దిశగా వేల మంది అమెరికా సైనికులు తరలుతున్నారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా మహమ్మద్ బాఘెర్ నియమితులయ్యారు. ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్‌లో చర్చలు జరిపారు. పశ్చిమాసియా పరిస్థితిపై చర్చించారు. చర్చలకు ఆతిథ్యమిస్తామని పాకిస్థాన్ ప్రకటించింది. పశ్చిమాసియా యుద్ధం ముగిసే సూచనలు కనిపించకపోవడంతో ముడి చమురు బ్యారెల్ ధర మళ్లీ 100 డాలర్లు దాటింది. యుద్ధం కారణంగా ఖతార్‌లో జరగాల్సిన పాప్ గాయని షకీరా సంగీత కచేరీ వాయిదా పడింది. యుద్ధంతో ఐరోపా పర్యాటకంపై భారీ దెబ్బ పడింది. అమెరికా కాల్పుల విరమణకు అంగీకరించినా.. తాము ఇరాన్, లెబనాన్‌లపై దాడులను కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. విస్తృత ఒప్పందం కుదిరే అవకాశముందని తెలిపారు. ఇరాన్ ముందు అమెరికా 15 డిమాండ్లను ఉంచినట్లు సమాచారం. అయితే ఇరాన్ అధికారులు దీనిని ఖండించారు. ఇరాన్ దాడులను ఎదుర్కొనేందుకు గల్ఫ్ దేశాలకు స్వల్ప శ్రేణి గగనతల రక్షణ వ్యవస్థలను పంపుతున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు.

**ఆయుధ ఉత్పత్తి కేంద్రాలపై..**

ఇరాన్‌లోని ఆయుధ ఉత్పత్తి కేంద్రాలపై ఇజ్రాయెల్ వరుస దాడులు చేసింది. టెహ్రాన్ ఉత్తర ప్రాంతంలో భారీ పేలుడు శబ్దం వినిపించింది. మరో పేలుడు నగరం మధ్యలో చోటుచేసుకుంది. ఇప్పటిదాకా జరిగిన దాడుల్లో 82,000 భవనాలు దెబ్బతిన్నాయి. లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపు మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసింది. బీరుట్ ఆగ్నేయ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌పై జరిగిన దాడిలో ముగ్గురు మరణించారు. దక్షిణ ప్రాంతంలో మరో ఐదుగురు మృతి చెందారు. దేశం వీడి వెళ్లాలని ఇరాన్ రాయబారిని లెబనాన్ ప్రభుత్వం ఆదేశించింది.

**సిటీ సెంటర్‌లో..**

ఇరాన్ ప్రయోగించిన 100 కిలోగ్రాముల వార్‌హెడ్‌తో కూడిన క్షిపణి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ సిటీ సెంటర్‌లో పడింది. అది పేలడంతో చుట్టుపక్కల ఇళ్లు, అపార్ట్‌మెంట్ల కిటికీలు ధ్వంసమయ్యాయి. ఉత్తర ఇజ్రాయెల్‌పై జరిగిన దాడిలో 30 ఏళ్ల మహిళ మరణించారు. కువైట్‌లో క్షిపణి శకలం కారణంగా విద్యుత్తు లైన్లు దెబ్బతిన్నాయి. దీంతో పలు గంటలపాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. బహ్రెయిన్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిగాయి. పలుమార్లు సైరన్లు మోగాయి. బహ్రెయిన్‌లోని తమ వెబ్ సర్వీసెస్‌లో అంతరాయం ఏర్పడినట్లు ప్రముఖ ఇకామర్స్ దిగ్గజం అమెజాన్ పేర్కొంది. క్షిపణులను అడ్డుకున్నామని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వెల్లడించింది. తూర్పు ప్రాంతంలోని చమురు క్షేత్రాలపైకి ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లను సౌదీ అరేబియా అడ్డుకుంది. 20 డ్రోన్లు తమ దేశంపైకి దూసుకొచ్చాయని సౌదీ తెలిపింది.

**ఖర్గ్‌ను సీజ్ చేయడానికి..**

పశ్చిమాసియాకు వేల మంది అమెరికా మెరీన్లు బయలుదేరారు. ఇరాన్ చమురు నెట్‌వర్క్‌కు కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని సీజ్ చేయడానికి అమెరికా ఈ సేనలను పంపుతున్నట్లు సమాచారం.

**లారిజానీ స్థానంలో..**

సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా మహమ్మద్ బాఘెర్ జోల్ఘదర్ నియమితులయ్యారు. ఇటీవల ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో మరణించిన లారిజానీ స్థానంలో ఆయనను ఇరాన్ ప్రభుత్వం నియమించింది. బాఘెర్.. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) మాజీ కమాండర్.

**మేం సిద్ధం: పాక్**

ఇరాన్ యుద్ధాన్ని ముగించడానికి జరిగే నిర్మాణాత్మక చర్చలకు ఆతిథ్యం ఇస్తామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. తాను ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో మాట్లాడినట్లు ఎక్స్‌లో వెల్లడించారు. పాక్‌లో చర్చలు జరపడానికి అమెరికా సూత్రప్రాయంగా అంగీకరించిందని ముగ్గురు అధికారులు తెలిపారు. షరీఫ్ ప్రకటనను ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పంచుకున్నారు.

**మార్కెట్లలో ఊగిసలాట**

ప్రపంచ స్టాక్ మార్కెట్లను యుద్ధం అతలాకుతలం చేస్తోంది. తొలుత మార్కెట్లలో ర్యాలీ సాగినా.. ఆ తర్వాత చమురు ధరలు పెరగడంతో మళ్లీ తగ్గిపోయాయి. ఎరువుల ఎగుమతులపై చైనా నియంత్రణ విధించింది. జపాన్‌లో ఇంధన అత్యవసర పరిస్థితి తలెత్తింది. ఫిలిప్పీన్స్‌లో ఇంధన అత్యవసర పరిస్థితిని అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ప్రకటించారు. ఇంధన, నీటి మౌలిక వసతులపై దాడులు చేస్తే తామూ యుద్ధంలో పాల్గొనాల్సి వస్తుందని సౌదీ అరేబియా, యూఏఈ హెచ్చరించినట్లు వార్తలొస్తున్నాయి. అమెరికాతో చర్చలకు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సిద్ధమయ్యారంటూ ఇజ్రాయెలీ మీడియా సంస్థ వెల్లడించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పశ్చిమాసియాలోని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మధ్య జరిగిన తాజా సంభాషణలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిందని వెల్లడించింది.

# మారనున్న రాజకీయ ముఖచిత్రం

లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల్ని పునర్విభజించాలని.. వాటి సంఖ్య 50 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో భౌగోళికంగా, రాజకీయంగా కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టారాజ్యంగా నియోజకవర్గాలను పునర్విభజించారని ఆరోపణలున్నాయి. వాటిని చక్కదిద్దేందుకు, ఓటర్ల సంఖ్య పరంగా రాష్ట్రంలో ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాల మధ్య ఉన్న వ్యత్యాసాల్ని సరిదిద్దేందుకు, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు, చట్టసభల్లో మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రాతినిధ్యం పెరిగేందుకు పునర్విభజన దోహదం చేస్తుంది. నియోజకవర్గాల పరిధి తగ్గడం వల్ల పాలనాపరంగా సౌలభ్యం ఉంటుంది. మంత్రివర్గం సంఖ్య కూడా పెరుగుతుంది. వివిధ వర్గాల రాజకీయ ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు పార్టీలకు వెసులుబాటు లభిస్తుంది. అందుకే రాజకీయాలకు అతీతంగా పార్టీలన్నీ పునర్విభజన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి.

**విభజన చట్టంలో ఇచ్చిన హామీకి మించి..**

గతంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు భౌగోళిక సరిహద్దులు, ఓటర్ల సంఖ్య, రిజర్వుడు స్థానాల పరంగా భారీ మార్పులు జరిగాయే తప్ప, మొత్తంగా నియోజకవర్గాల సంఖ్య మాత్రం పెరగలేదు. దానికి భిన్నంగా ఈసారి నియోజకవర్గాల సంఖ్య భారీగా పెరగబోతోంది. ఏపీలోని 175 అసెంబ్లీ స్థానాల్ని 225కి పెంచుతామని విభజన చట్టంలో కేంద్రం హామీ ఇచ్చింది. అంటే 29 శాతం సీట్లు పెరిగేవి. కానీ 50 శాతం సీట్లు పెంచాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల సంఖ్య ఏకంగా 263కి పెరుగుతుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల సంఖ్య పరంగా నియోజకవర్గాల మధ్య చాలా వ్యత్యాసం ఉంది. భీమిలి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య దాదాపు 3.64 లక్షలుంటే.. పెదనలో 1.65 లక్షలు మాత్రమే. ఓటర్ల సంఖ్యపరంగా నియోజకవర్గాల్లో నెలకొన్న ఇలాంటి అసమానతలనూ సరిదిద్దాలి.

# దక్షిణాదిపై ‘50 శాతం’ కుట్ర

ఢిల్లీ: దేశంలో జనాభా సంఖ్య ఆధారంగా ఎంపీ సీట్లను 50 శాతం పెంచుతుండటం వెనుక కుట్ర దాగి ఉందని, అదే జరిగితే దక్షిణ భారతంతో సంబంధం లేకుండా ఉత్తర భారతంలోని నాలుగు రాష్ట్రాల సీట్లతో కేంద్రంలో అధికారంలోకి రావొచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో మంగళవారం ఓ టీవీ ఛానెల్ ఏర్పాటు చేసిన చర్చ సందర్భంగా ఆయన నియోజకవర్గాల పునర్విభజన, 50 శాతం ఎంపీ సీట్ల పెంపు తదితర అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఎంపీ స్థానాల విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం ఉంది. అంతే స్థాయిలో సీట్ల పెంపు జరగాలి. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్రం అన్యాయం చేస్తోంది. వివక్ష చూపుతోంది. దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్‌పై పోరాటానికి సిద్ధం కావాలి. 50 శాతం సీట్ల పెంపు ఏ లెక్క ప్రకారం జరుగుతుంది? అలా సీట్ల పెంపు అనేది దక్షిణాది రాష్ట్రాలపై ఫైనల్ బుల్లెట్. ఈ పద్ధతిలో తమిళనాడు, పుదుచ్చేరిలో ఇప్పుడున్న 40 సీట్లు 60 అవుతాయి. అదే యూపీలో 80 సీట్లు 120 అవుతాయి. అలా మధ్యప్రదేశ్, యూపీ, రాజస్థాన్, బిహార్... ఈ నాలుగు రాష్ట్రాల సీట్లతో కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగే సీట్ల వల్ల దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వంలో, జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల నేతలకు చోటు లేకుండా పోతుంది. ఉత్తర, దక్షిణ భారతానికి మధ్య అంతరాన్ని ఎన్‌డీయే ప్రభుత్వం పెంచుతోంది. అన్ని రాజకీయ పక్షాలతో చర్చించి సీట్ల పెంపుపై ముందుకు వెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తా. మోదీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా ఐక్యం కావాలి: ప్రధాని మోదీ త్రీడీ పాలసీని అవలంబిస్తున్నారు. డీలిమిటేషన్, డిస్క్రిమినేషన్, డివల్యూషన్ అనే మూడు అంశాలతో కూడిన విధానాన్ని పాటిస్తున్నారు. దక్షిణ భారతానికి కేంద్ర మంత్రివర్గంలో ప్రాధాన్యమున్న పోర్ట్‌ఫోలియోలను ఇవ్వడం లేదు. ఒక్క నిర్మలా సీతారామన్‌కు తప్ప టాప్ 10 పోర్ట్‌ఫోలియోలలో భాగస్వామ్యం లేదు. మోదీ గుజరాత్ నుంచి వచ్చి యూపీలో పోటీ చేసి ప్రధాన మంత్రి కావొచ్చు. మరి వెంకయ్యనాయుడిని ఎందుకు రాష్ట్రపతిని చేయలేదు? మొదటి నుంచి పార్టీలో ఉన్న వ్యక్తిని ఎందుకు పక్కన పెట్టారు? భారత్ అంతా ఒక్కటేనని భావించాలి కదా? ఎందుకు సమతౌల్యం పాటించరు? గతంలో దక్షిణ భారతం నుంచి జీఎంసీ బాలయోగి స్పీకర్‌గా పనిచేశారు. గత 12 సంవత్సరాల మోదీ పాలనలో దక్షిణ భారత రాష్ట్రాల నుంచి ప్రాధాన్యమున్న పదవుల్లో ఎవర్ని తీసుకున్నారు? మోదీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ముందుకు కదలాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఇరాన్ చమురు వచ్చేస్తోంది!

మనదేశ చమురు అవసరాల్లో 88% దిగుమతులే తీరుస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడి ప్రారంభించాక, ఉద్రిక్తతలు గల్ఫ్ దేశాలకు విస్తరిస్తున్నాయి. ప్రపంచ చమురు రవాణాలో 20% వాటా కలిగిన హర్మూజ్ జలసంధిలో ఆటంకాలు ఏర్పడటంతో, చమురు రంగం సంక్షోభంలో పడింది. చమురు, ఎల్‌పీజీ, సీఎన్‌జీ సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, ధరలు పెరిగిపోతున్నాయి. ప్రపంచ దేశాలకు ఈ సెగ తగలడంతో, చమురు ధరలు తగ్గిద్దామన్న ఉద్దేశంతో ఇరాన్ చమురు కొనుగోళ్లపై ఆంక్షలను అమెరికా తాత్కాలికంగా (30 రోజుల పాటు) ఎత్తివేసింది. అంతక్రితమే రష్యా చమురు కొనుగోలు చేయడానికీ అమెరికా అనుమతులు ఇచ్చింది. ఆ వెంటనే భారతీయ రిఫైనరీలు 40 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును కొనుగోలు చేసి పెట్టుకున్నాయి. చమురుతో పాటు వంట గ్యాస్ (ఎల్‌పీజీ) దిగుమతి అవసరాలూ మనదేశానికి అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్ చమురుపైనా మన రిఫైనరీలు దృష్టి సారించాయి.

**రూపాయల్లోనైనా సరే..**

తమ వద్ద చమురు కొనుగోలు చేసేవారు డాలర్లలో చెల్లింపులు చేయాలని నేషనల్ ఇరానియన్ ఆయిల్ కో, ఇతర ట్రేడర్లు కోరుతున్నట్లు సమాచారం. కొందరైతే రూపాయల్లో చెల్లింపులు చేసినా సరేనని చెబుతున్నారట. 1970ల్లో వచ్చిన రెండు చమురు సంక్షోభాలను కలిపినా, అంతకంటే పెద్దదిగానే ప్రస్తుత ఇంధన సంక్షోభం కనిపిస్తోందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంటున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

**6-8 డాలర్లు ఎక్కువగా..**

ఇరాన్ చమురును కొనుగోలు చేసి, సముద్ర మార్గంలో తీసుకెళ్లేందుకు 30 రోజుల పాటు (మార్చి 20-ఏప్రిల్ 19) ఆంక్షల మినహాయింపును గత శుక్రవారం అమెరికా ఇచ్చింది. ట్యాంకర్లు సహా ఎటువంటి నౌకల్లోనైనా చమురును రవాణా చేయడానికి ఇది వర్తిస్తుంది. ఐసీఈ బ్రెంట్ ముడిచమురు ధరపై 68 డాలర్ల ప్రీమియం ధరకు ఇరాన్ ట్రేడర్లు తమ చమురును ఆఫర్ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. కార్గో గమ్యస్థానం చేరిన 7 రోజుల్లో చెల్లింపులు జరగాల్సి ఉంటుందనీ అంటున్నారు.

# పటేల్ స్ఫూర్తితో ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధిస్తారా?

హైదరాబాద్ : సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తారా? అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బీజేపీని ప్రశ్నించారు. గుజరాత్‌లో పటేల్ విగ్రహం పెట్టడం సంతోషకరమనీ, దాంతోపాటు ఆయన ఆదర్శాలను కూడా పాటించాలని డిమాండ్ చేశారు. ఆయన విగ్రహం పెడతారు తప్ప ఆయన చేసిన పనులను మాత్రం అమలు చేయబోరని అన్నారు. మంగళవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భట్టి పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చిందన్నారు. ఇది పేద ప్రజలను చీటింగ్ చేయడం కాదా? అని ప్రశ్నించారు. గాంధీని భౌతికంగా బతకనీయలేదనీ, ఆయన పేరు కూడా లేకుండా చేశారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 1950 నుంచి 2014 వరకు 13 మంది ప్రధాన మంత్రులు రూ.56.66 లక్షల కోట్ల అప్పు తెచ్చారని వివరించారు. 2014 నుంచి ఈ 12 ఏండ్లలో ప్రధాని మోడీ రూ.140 లక్షల కోట్ల అప్పు తెచ్చారని చెప్పారు. అంటే ఏడాదికి సగటున రూ.11 లక్షల కోట్లు అప్పు చేశారని వివరించారు. దీంతో భారత్ అప్పు ప్రస్తుతం రూ.197 లక్షల కోట్లకు చేరిందన్నారు. రాష్ట్రాల నుంచి పన్నులు వెళ్తేనే కేంద్రం వద్ద నిధులుంటాయని అన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి రూపాయి వెళ్తే తిరిగి 30 పైసలు మాత్రమే వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అందరం కలిసి కేంద్రంపై పోరాడాలన్నారు. రూపాయిలో కర్నాటకకు 15 పైసలు, ఏపీకి 62 పైసలు, తమిళనాడుకు 26 పైసలు, కేరళకు 60 పైసలు వస్తున్నాయని వివరించారు. కానీ బీహార్‌కు రూ.6.69 పైసలు, ఉత్తరప్రదేశ్‌కు రూ.1.96 పైసలు, మధ్యప్రదేశ్‌కు రూ.1.87 పైసలు, రాజస్థాన్‌కు రూ.1.19 పైసలు వెళ్తున్నాయని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు, తెలంగాణ ఏం పాపం చేశాయని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్రానికి రూపాయి కడితే రూపాయి తిరిగి ఇచ్చేలా ఒత్తిడి తేవాలని చెప్పారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందకుండా మోడీ ప్రకటించిన వికసిత్ భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యమని మోడీ ప్రకటించారని గుర్తు చేశారు. అందులో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా, అవమానాలు చేసినా క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలతో తెలంగాణ అభివృద్ధి ఆగేది లేదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతోపాటు రాజీవ్ యువ వికాసం వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ప్రస్తుతం నెలకు రూ.700 కోట్లు చెల్లిస్తున్నామని అన్నారు. ఇక నుంచి రూ.వెయ్యి కోట్లు చెల్లిస్తామని చెప్పారు.

# జిహాద్ కోసం ‘అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్’

అమరావతి: యువతలో ఉగ్రవాద భావజాలాన్ని పెంపొందించటం, వారిని జిహాద్ కోసం సన్నద్ధం చేయటమే లక్ష్యంగా విజయవాడకు చెందిన యువకులు మహమ్మద్ రహమతుల్లా షరీఫ్, మీర్జా సొహైల్ బేగ్, మహమ్మద్ దానిష్‌లు కలిసి ‘అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్’ పేరిట ఓ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారని కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం (సీఐ సెల్) తేల్చింది. వీరు నిషేధిత ఉగ్రవాద సంస్థలైన అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్ కాంటినెంట్ (ఏక్యూఐఎస్), ఐసిస్‌తో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించింది. విదేశాల్లోని హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు ‘భారత్‌పై యుద్ధం’ (గజ్వాఏహింద్) కోసం వీరు పనిచేస్తున్నట్లు నిర్ధారించింది. దేశవ్యాప్తంగానూ పలు రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్ విస్తరించినట్లు తేల్చింది. వీరు ముగ్గురూ ఉగ్రవాద శిక్షణ పొందడానికి నెల రోజుల్లోగా పాకిస్థాన్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు గుర్తించింది. విజయవాడలోని వేర్వేరు ప్రాంతాల్లో వీరి ముగ్గుర్నీ సోమవారం అదుపులోకి తీసుకుంది. సీఐ సెల్ దర్యాప్తులో గుర్తించిన అంశాలివి.

**విద్వేషపూరిత ప్రసంగాలు చూసి..**

విజయవాడలో ఓలా, ర్యాపిడో బైక్ డ్రైవర్‌గా పనిచేసుకునే మహమ్మద్ రహమతుల్లా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల నాయకుల విద్వేషపూరిత ప్రసంగాల వీడియోలు చూస్తూ ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షితుడయ్యాడు. ఉగ్రవాద సంస్థల సామాజిక మాధ్యమ ఖాతాల్ని అనుసరించటంతో పాటు ఉగ్రవాద కార్యకలాపాల వీడియోలు పోస్టు చేసేవాడు. లేజర్ మార్కింగ్ పని చేసే భవానీపురానికి చెందిన మహ్మద్ దానిష్, బిర్యానీ పాయింట్‌లో పనిచేసే మహంతిపురానికి చెందిన మీర్జా సొహైల్ బేగ్‌లతో కలిసి జిహాద్ కార్యకలాపాలను విస్తృతం చేశాడు.

# ఎంత చెప్పినా మారరా?

* **సీఎం చంద్రబాబు హెచ్చరించే పరిస్థితి ఎందుకొస్తోంది**
* **ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

అమరావతి: కొందరు ప్రజాప్రతినిధులపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయని, ఎంత చెప్పినా వారిలో మార్పు రావట్లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోపణలపై సీఎం చంద్రబాబు హెచ్చరించే వరకు పరిస్థితిని ఎందుకు తెచ్చుకుంటున్నారని నిలదీశారు. మంగళవారం విజయవాడలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలతో సమావేశం సందర్భంగా పలువురి తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ‘కొందరు ఎమ్మెల్యేలు పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్ని బూచిగా చూపి బెదిరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు వసూళ్లు చేస్తున్నారని పరిశ్రమల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రానికి పరిశ్రమలు తేవడానికి ఎంతో కష్టపడుతున్నాం. మిమ్మల్ని నమ్మి టికెట్లు ఇచ్చాం. ఇలా చేస్తే పార్టీ గౌరవానికి భంగం కలిగించిన వారవుతారు’ అని స్పష్టం చేశారు.

**సభ్యత్వంలో ఎందుకు వెనకబడుతున్నారు?**

కొందరు ప్రజాప్రతినిధులు పార్టీ సభ్యత్వంలో వెనకబడటంపై పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ‘ఎందుకు చేయలేకపోతున్నారు? ఎన్నికల్లో ఎక్కువ టికెట్లు అడగాలంటే సభ్యత్వం మరింత పెరగాలి. సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి’ అని సూచించారు.

# మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం

హైదరాబాద్: మత సామరస్యానికి ప్రతీకగా మూసీ నది పరీవాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం.. భారీ శివాలయ నిర్మాణంతో ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టబోతోంది. అందులో భాగంగా గండిపేట మండలం మంచిరేవుల గ్రామ పరిధిలోని 800 సంవత్సరాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం, 1,400 ఏళ్ల నాటి మచిలేశ్వర ఆలయం వద్ద నూతనంగా ఓంకారేశ్వర మందిరాన్ని నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించింది. కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనలు, సలహాలతో ఆలయ నిర్మాణ శైలి ఖరారైంది. ఈ పనులకు వీరభద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో నెల 28న ఉదయం 8.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో శృంగేరి పీఠం ముఖ్య ప్రతినిధులు పాల్గొంటారు.

**అభివృద్ధికి మొదటి మెట్టు..**

పశ్చిమాన ఉన్న జంట జలాశయాల నుంచి తూర్పున ప్రతాపసింగారం వరకు నగరంలో మూసీ 55 కి.మీ పొడవున ప్రవహిస్తోంది. ఈ పరిధిలో నాలుగు మతాలకు సంబంధించిన ప్రార్థనాలయాలను నిర్మించి.. అభివృద్ధి పనులను మత సామరస్యానికి ప్రతీకగా నిలపాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారు. మంచిరేవులలోని పురాతన వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, పురానాపూల్ వద్ద భారీ మసీదు, గౌలిగూడ వద్ద గురుద్వారా, నాగోల్‌లో చర్చి నిర్మాణం చేపట్టాలని ప్రణాళిక సిద్ధం చేశారు. జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు త్వరలో చేపట్టనున్న మూసీ తొలిదశ అభివృద్ధి పనులను ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనతో ప్రారంభించబోతున్నారు.

**చరిత్రాత్మక మందిరాలు..**

గండిపేట జలాశయం దిగువన గుట్టపై ఉన్న వీరభద్రస్వామి దేవాలయం కాకతీయుల కాలం నాటిదని, పక్కనే ఉన్న మచిలేశ్వర శివలింగాన్ని చాళుక్యులు ప్రతిష్ఠించినట్లు ఆలయ నిర్వాహకులు పరమేశ్వర్ తెలిపారు. ఈ దేవాలయాలను పునరుద్ధరించడంతోపాటు.. పక్కనే 8 ఎకరాల విస్తీర్ణంలో ఓంకారేశ్వర మందిరాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆలయంలో ఎత్తయిన గాలి గోపురం.. అందులో నుంచి లోపలికి వెళ్తే వేర్వేరు మండపాలు ఉంటాయి. అక్కడి నుంచి లోపలికి వెళ్లాక ఓంకారేశ్వర మందిరం ఉంటుంది. గర్భాలయ గోపురాన్ని 14 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పు.. 64 అడుగుల ఎత్తుతో నిర్మించనున్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

**: పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**



పటాన్ చెరు, ప్రజాస్ఫూర్తి : పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకు సైతం సిద్ధమని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాగనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# శ్రీ వాసవి సేవాసమితి ద్వారా సమాజ సేవలు



ప్రజా స్ఫూర్తి/సూర్యాపేట : శ్రీ వాసవి సేవాసమితి ద్వారా సూర్యాపేట జిల్లాలో ఎన్నో సామాజిక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళ వారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సూర్యాపేట జిల్లా ఆర్య వైశ్య మహాసభ నాయకులు వెంపటి శబరినాథ్ కు శ్రీ వాసవి సేవాసమితి సభ్యులు గా నూతన సభ్యత్వం ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 9 సంవత్సరాల క్రితం వనపర్తి కి చెందిన పూరి సురేష్ శెట్టి స్థాపించిన ఈ సంస్థ అంచెలంచెలుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతుందని తెలిపారు.సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని అనుకునే వారు సభ్యులుగా చేరవచ్చు అని తెలిపారు.

# భగవంతుని నామస్మరణ తోనే మోక్ష ప్రాప్తి



ప్రజా స్ఫూర్తి/సూర్యాపేట : భగవంతుని నామ స్మరణను ఎవరైతే ఉచ్చరిస్తారో వారికి భగవంతుని సన్నిధికి చేరడానికి అతి స్వల్ప మైన దారి లభిస్తుందని పురాణములు చెబుతున్నట్లు శ్రీ సంతోషిమాత దేవాలయం అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ తెలిపారు. మంగళ వారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో ఉగాది నుండి శ్రీ రామ నవమి వరకు ఏర్పాటు చేసిన శ్రీరామ భజన, శ్రీ లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమంలో పాల్గొని వారు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. రోజు రోజు కు కనుమరుగు అవుతున్న హిందూ సాంప్రదాయం పరిరక్షనకు భగవాన్ నామ సంకీర్తన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేల సంవత్సరముల నుండి మన సనాతన ధర్మం కొనసాగుతుందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎక్కడ భగవాన్ నామ సంకీర్తన జరిగిన పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయం ఉపాధ్యక్షులు బెలిదే అశోక్, తాళ్లపల్లి రామయ్య,తల్లాడ కృష్ణ మూర్తి కక్కిరేణి పద్మ,కర్నాటి సూర్యకళ, తెడ్ల పల్లవి, కొల్లూరు రత్మమాల, తాళ్ళపల్లి సుగంధ మాల,మోదుగు నాగమణి,పోతుగంటి సంధ్య,ఓరుగంటి కనక రత్నం,వీణారాణి, జగదీశ్వరీ, సోమేశ్వరీ, మంత్రాల పద్మ,బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం

* **డీఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్ కు ఉత్తమ ప్రతిభా పురస్కారం**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రపంచ క్షయ వ్యాధి (టీబి) దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, హైదరాబాద్ వారి చేతుల మీదుగా మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ టిబి నియంత్రణ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు" అందజేయబడింది.ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ, టిబి నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు వినియోగించుకోవాలని, లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టిబి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, నిరంతరంగా మందులు వాడటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.జిల్లాలో టిబి కేసులను గుర్తించడం, సమయానికి చికిత్స అందించడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాల్లో వైద్య సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగా ఈ పురస్కారం లభించిందని ఆయన పేర్కొన్నారు.

# మత్తు పదార్థాల జోలికి పోవొద్దు... జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

* **విద్యార్థులకు సూచించిన జగద్గిరిగుట్ట సి ఐ వెంకటేష్**






ప్రజాస్ఫూర్తి/జగద్గిరిగుట్ట మత్తు పదార్థాల పట్ల చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. స్థానిక రాజీవ్ గృహకల్ప లోని సంస్కృతి పాఠశాలలో జగ్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలిసి తెలియని వయసులో కొందరు మత్తు పదార్థాలకు బానిస అవుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీపం కాలుతుందని తెలిసి దానిని ఎవరు ముట్టుకోబోరని, అదేవిధంగా మత్తు పదార్థాల జోలికి కూడా పోవద్దని సూచించారు. సొసైటీలో నకిలీ వస్తువులు ఏ విధంగా అయితే లభ్యమవుతున్నాయో అదే స్థాయిలో మత్తు పదార్థాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని నియంత్రించడంలో పోలీస్ శాఖ కట్టు దిట్టమైన చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు అన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలిసిన వ్యక్తులైన, తెలియని వ్యక్తులైన తమ పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లయితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. బాలికలకు రక్షణ కోసం షీ టీం లను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావానికి అస్సలు గురి కావద్దని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూచించిన విధంగా సత్ప్రవర్తనతో మెలగాలని సిఐ తెలిపారు. విద్యార్థులు సొసైటీ పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. ఎవరైనా అపాయంలో ఉంటే వారికి తప్పకుండా సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముళ్లకత్వ చెరువు వద్ద అక్రమ నిర్మాణాలు

* **కూకట్ పల్లి మండలం లో భూ కబ్జాలు**






కూకట్ పల్లి / ప్రజాస్ఫూర్తి : కూకట్‌పల్లి మండల పరిధిలోని ముళ్లకత్వ చెరువు పరిసరాల్లో ప్రభుత్వ భూములపై కబ్జా దారుల కన్నుపడింది. రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారు. ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారుల స్పందన కనిపించకపోవడం, కళ్లముందే నిర్మాణాలు కొనసాగుతుండటం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన యంత్రాంగమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందా..? లేక అక్రమార్కులతో కుమ్మక్కైందా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు బహిరంగంగా వినిపిస్తున్నాయి. సామాన్యుడు చిన్న నిర్మాణం చేసినా నోటీసులు జారీ చేసే అధికారులు, ఎకరాల కొద్దీ భూములు ఆక్రమణకు గురవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది స్థానికుల ఆవేదన. కొందరు అధికారులు, స్థానిక నాయకులు కలిసి భూముల కబ్జాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.పర్యావరణ పరంగా కీలకమైన చెరువు పరిసరాల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు జరగడం భవిష్యత్తులో ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో పారదర్శక చర్యలు తీసుకుంటేనే ప్రజల నమ్మకం నిలుస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

* **రెవిన్యూ అధికారుల పాత్రపై అనుమానాలు..?**

కూకట్ పల్లి మండలం జరుగుతున్న కబ్జాలలో రెవిన్యూ అధికారుల పాత్రపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. ముఖ్యం గా ఆర్ఐ స్థాయి అధికారిపై బహిరంగంగా ఆరోపణలు వస్తున్నా, ఉన్నతాధికారులు విచారణ చేపట్టకపోవడం వెనుక కారణాలు ఏమిటన్నది స్పష్టంగా తెలియడం లేదు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వారే కబ్జాలకు ప్రోత్సాహం ఇస్తే, ప్రజలు ఎవరిని నమ్మాలి అని ప్రశ్నిస్తున్నారు. కూకట్‌పల్లిలో జరుగుతున్న ఈ 'భూ' వ్యవహారంపై జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రభుత్వ భూములు పూర్తిగా ఆక్రమణకు గురై, భవిష్యత్తులో కేవలం రికార్డుల్లో మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలంటే... అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# గురుకుల ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు




ప్రజాస్ఫూర్తి, జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఎంపీపీఎస్ అక్కపల్లి గూడా పాఠశాలలో 22 మంది విద్యార్థులు గురుకుల విద్యా సంస్థలో జరిగిన ప్రవేశపరీక్షకు అర్హత సాధించారని మండల విద్యాధికారి నడిమెట్ల విజయకుమార్ తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇన్ని సీట్లు సాధించడం రాష్ట్రస్థాయిలో ఇదే మొట్టమొదటిసారి అని తెలిపారు. విద్యార్థులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఎంపీపీఎస్ అక్క పెల్లిగూడా ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఏ కరుణ, పీ మౌనిక, ఎస్ రాజశేఖర్, బి మహేష్, బి శ్రీకాంత్, సుదీప, శ్రీలత, నాజియాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెండ్లగూడ ఉపాధ్యాయులు జి శ్రీలత ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

# బాల్యం బలి కావద్దు భవిష్యత్తు అంధకారం కావద్దు

* **అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి రాజు కృష్ణ**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలపై న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి రాజ్ కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు బాల్యవివాహాలు నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు.బాల్య వివాహాల వల్ల జరిగే దుష్ప్రభావాలను వివరించారు.భారత రాజ్యాంగం కల్పించిన ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు ప్రాథమిక హక్కుల లో భాగం అని తెలియజేశారు. విద్యార్థినులందరూ అవకాశాలను అందుపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ రూపొందించినటువంటి పలు లఘు చిత్రాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్రమ్మ,వైస్ ప్రిన్సిపల్ నాగవల్లి, బోధన సిబ్బంది నాగవల్లి, ఉమ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలి




హైదరాబాద్/ ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్ లతో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 10 థీముల తో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్లక్ష్య వైఖరితో కాకుండా బాధ్యతతో ప్రతి ఒక్కరూ తమకు నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా పని చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి శాఖ ఈఆఫీస్ నిర్వహణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వేసవి కాలం అయినందున జిల్లాలో ఏ ఒక్క చోట కూడా త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని, అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, పైపు లీకేజులు లేకుండా చూడాలని, ఎక్కడ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అవసరమైన చోట బోరు మోటార్లు, హ్యాండ్ పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపించాలని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాలను సైతం సందర్శిస్తూ నీటి సరఫరా తీరుతెన్నుల గురించి వారి ద్వారా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ డీఆర్ఓ సంగీతం, జడ్పీ సి ఈ ఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేశ్ మోహన్, సిపిఓ సౌమ్య, పిడి డీఆర్డీఏ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషురామ్, కె.రామవేశ్వరి దేవి, పద్మావతి, ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవుల వర్ధంతి




మహబూబాబాద్ జిల్లా , ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణంలోని కోర్టు నుండి భగత్ సింగ్ విగ్రహం వరకు పివైఎల్ ఆధ్వర్యంలో క్రోవత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రగశీల యువజన సంఘం పివైఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సామ పాపయ్య, బట్టు చైతన్యాలు ప్రసంగిస్తూ దేశంలో మతోన్మాదం పేరుతో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి యువజన విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికై యువతరం భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని చెప్పి ప్రైవేటికరణ వ్యతిరేకంగా, కార్పొరేటీకారునకు వ్యతిరేకంగా యువతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీవెల్ జిల్లా నాయకులు తెలబోయిన కృష్ణ, అలీ, ఏకాంబరం, స్టాలిన్, మహేష్, బాబుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాల ఏర్పాట్లలో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ అంకిత్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం లో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీరామనవమి, 28న మహా పట్టాభిషేకం ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లలో వేగం పెంచాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా వంటి మౌలిక సదుపాయాలు ఎటువంటి లోపాలు లేకుండా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన భూమి పూజ, శిలాఫలకం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులలో ఆలస్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలు, వేదికలు, భక్తులకు కూర్చునే సదుపాయాలు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్, వైద్య సదుపాయాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.ఉత్సవాల సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించగలమని, ప్రతి అధికారి బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అంకిత్ అన్నారు.ఈ పరిశీలనలో శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈవో, వివిధ శాఖల అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్ ఓ ఎండమావి

* **ప్రభుత్వంపై ఏలేటి విసుర్లు**

హైదరాబాద్: ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎండమావితో పోల్చారు. ఎండమావిలో నీళ్లు ఉండనట్లే ఈ బడ్జెట్‌లోనూ నిధులు ఉండవన్నారు. బడ్జెట్‌పై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన అధికారపక్షంపై విరుచుకుపడ్డారు. "వాస్తవాలు దాచిపెట్టి, ప్రజలను మభ్యపెడుతున్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ ఎలా సాధిస్తారో చెప్పాలి. 201314 నుంచి ఇప్పటివరకు జీఎస్‌డీపీ రూ.17.81 లక్షల కోట్లు మాత్రమే. ఏడాదికి సగటున రూ.లక్షన్నర కోట్లకు మించడంలేదు. అలాంటప్పుడు వచ్చే తొమ్మిదేళ్లలో రూ.90 లక్షల కోట్లకు ఎలా చేరుకుంటారు? కాగ్ నివేదికను చూస్తే ఈ ఏడాది జనవరి వరకు రెవెన్యూ వసూళ్లు 60% మాత్రమే వచ్చారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లాలో సుమారు లక్ష ఎకరాల వరకు సాగు చేసిన మొక్కజొన్న పంటను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేపట్టాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకేఎస్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రభాకర్ అన్నారు.మహబూబాబాద్ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యాలయంలో ఏఐయుకేఎస్ డివిజన్ కమిటీ సమావేశం కురుసం రంగయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రభాకర్ మాట్లాడుతూ మొక్కజొన్నలను ప్రభుత్వమే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోతే దళారీలు క్వింటాలుకు 16001700 కొనుగోలు చేసేడితే రైతు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిరి రైతు ప్రభుత్వం అని చెబుతున్న రేవంత్ రెడ్డి పరిపాలనలో మొక్కజొన్న రైతు క్వింటాలుకు ₹800నుంచి 900 నష్టపోతే రైతాంగం మరింత అప్పుల పాలయ్యే ప్రమాదం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐయుకేఎస్ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి ఈక బిక్షం, బానోతు వీరన్న, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన చర్యలు

**: ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 27,28 తారీఖులలో భద్రాచలంలో జరగనున్న శ్రీరామనవమి,పట్టాభిషేక మహోత్సవానికి ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఇందులో భాగంగానే పార్కింగ్ స్థలాలు,కళ్యాణ మంటపం,సెక్టార్లు , లడ్డూ,తలంబ్రాల కౌంటర్ల వద్దకు భక్తులు సులభంగా కనుగొని అక్కడికి చేరుకునే విధంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఒక క్యూఆర్ కోడ్ ను ఆన్లైన్ లింకును రూపొందించడం జరిగిందని తెలిపారు. https://ramanavami.4sightai.com/ ఆన్లైన్ లింకు ద్వారా రామనవమి , పట్టాభిషేక మహోత్సవ తేదీలలో భద్రాచలంలో భక్తుల సులభంగా వారు చేరుకోవాల్సిన స్థలాలకు చేరుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా సుమారుగా 2000 మంది పోలీసులతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లను చేయడం జరుగుతుందని తెలిపారు.కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీసు వారికి సహకరించాలని కోరారు.అదే విధంగా ఆ రెండు రోజులు పాటు భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు వారు విధించే ఆంక్షలకు భద్రాచలం పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


# పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్



మహబూబాబాద్ జిల్లా , ప్రజాస్ఫూర్తి:మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి లోబరుచుకుని,గర్భవతిని చేసిన నిందితుణ్ణి మహబూబాబాద్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు.పోలీసుల కథనం మేరకు నిందితుడు ఎండి మౌలానా, తండ్రి మహమూద్, 20 సం.,లు, నివాసం కంకరబోర్డు, మహబూబాబాద్ అనే అతను స్థానిక ఫోటో స్టూడియోలో పనిచేస్తున్నాడు. ఫోటో కోసం వచ్చిన బాలికకు మాయ మాటలు చెప్పి లోబరుచుకొని, సంవత్సర కాలంగా రిలేషన్షిప్ కొనసాగిస్తున్నాడు.బాలిక తీరుపై మార్పును గమనించిన తల్లిదండ్రులు కూతురిని నిలదీయడంతో అసలు విషయం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు తమ బిడ్డకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించాగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, మంగళవారం నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినామని టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

# ఆలయాలు సామాజిక చైతన్యానికి వేదికలుగా నిలవాలి

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:నైతిక విలువల పెంపునకు, సామాజిక చైతన్యానికి ధార్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని, అందుకు దేవాలయాలు వేదిక కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, కొత్తగడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. మంగళవారం సుజాతనగర్ మండలం సర్వారం గ్రామపంచాయతీ ఒడ్డుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ కోదండ రామాలయ ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భక్తిభావం మనుషుల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తుందని, ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టు స్వామి, సర్పంచ్ భూక్యా సునీత, భూక్యా శ్రీనివాస్, రాంబాబు, హత్తిరామ్, ఎల్ వినాయక్, శోభన్, రమేష్, శ్రీను, జుంకి లాల్, కిషన్, అశోక్, సోజల్,శంకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


# తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




ప్రజా స్ఫూర్తి, నల్గొండ : నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని తిప్పర్తి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు, స్టేషన్ పరిధిలోని పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లోని రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్ విభాగం, లాక్ అప్, ఎస్. హెచ్.ఓ గది తదితర విభాగాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించి,స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్రంగా విచారణ చేసి, చట్ట ప్రకారం నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతిరోజూ తమ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రజా ఫిర్యాదులపై ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణ స్పందన చూపాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ విధుల్లో ఉన్న సిబ్బంది డయల్ 100 కాల్స్కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించి, మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ మరియు డయల్ 100 సేవల వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే, అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, జూదం వంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ల వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్.ఐ వి శంకర్ , పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ కన్నా ప్రభుత్వా ఆసుపత్రులే ప్రాధాన్యం

- **తాము పనిచేసే ఆసుపత్రుల్లోనే చికిత్స- ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం పెంపొందిస్తున్న భద్రాద్రి వైద్య సిబ్బంది**
- **సాధారణ సిబ్బంది నుండి డాక్టర్ల వరకు**
- **మెరుగైన వైద్య సేవలకు నిలువెత్తు నిదర్శనం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు మెరుగైన వైద్య సేవలను అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్నాయి. ఈ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందే తాము సేవలందిస్తున్న అదే ఆసుపత్రుల్లో చికిత్స పొందడం విశేషంగా నిలుస్తోంది. నర్సింగ్ ఆఫీసర్లు , ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ , ఆఫీస్ సిబ్బంది నుండి డాక్టర్ల వరకు ఇదే తరహాలో తమ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలకు ప్రాధాన్యత ఇస్తున్నారు .సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు తమకు లభించే రీయింబర్స్మెంట్, హెల్త్ కార్డ్ వంటి సదుపాయాల కారణంగా పెద్ద ప్రైవేట్ ఆసుపత్రులు లేదా కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించే పరిస్థితి ఉండగా, భద్రాద్రి జిల్లాలో మాత్రం వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో పనిచేసే సిబ్బంది ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తాము పనిచేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులపైనే నమ్మకం ఉంచుతూ తమకు, తమ కుటుంబ సభ్యులకు అక్కడే చికిత్స చేయించుకుంటున్నారు.ఇటీవల పలువురు మహిళా సిబ్బంది తాము పనిచేస్తున్న ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకుని ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. కొద్ది నెలల క్రితం పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ ఆఫీసర్ మమత సిజేరియన్ ద్వారా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. వారం క్రితం అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్ తగరం గణేష్ తన భార్యకు సుఖప్రసవం నిర్వహించి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అలాగే ఇల్లందు ఆసుపత్రిలో ఫార్మసిస్ట్గా పనిచేస్తున్న రజని సిజేరియన్ ద్వారా ఆడబిడ్డకు జన్మనిచ్చారు.భద్రాచలం ఆసుప్రతిలో పనిచేస్తున్న డాక్టర్ ఆశా పర్వీన్ కి అదే ఆసుపత్రిలో సుఖప్రసవం జరిగింది.భద్రాచలం నర్సింగ్ సూపరింటెండెంట్ యశోద కూతురికి డెలివరీ తర్వాత పుట్టిన శిశువు వెంటనే ఏడుపు రాకపోతే కొన ఊపిరితో ఉన్న శిశువును సైతం ఆ ఆసుపత్రిలోని పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స చేసి ఊపిరి పోసారు.అలాగే గడిచిన ఒక సంవత్సరం కాలం లో పదుల సంఖ్య లో సిబ్బంది భద్రాచలం, మణుగూర్ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగాయి. ప్రసవాలే కాకుండా సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు కంటి ఆపరేషన్లు, ఎముకల ఆపరేషన్లు, గర్భసంచి ఆపరేషన్లు, మరియు ఇతర సేవలు సైతం తాము పనిచేస్తున్న ఆసుపత్రులలో చికిత్స పొందారు.ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, ఆసుపత్రులలో వసతులు వైద్య ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని ఈ సంఘటనలు స్పష్టంగా తెలియజేస్తున్నాయని డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు తెలిపారు.అన్ని ఆసుపత్రుల్లో 24 గంటల వైద్య సేవలు, ఉచిత రక్త పరీక్షలు, టీఫా స్కానింగ్, ఏసీ వార్డులు, పరిశుభ్రమైన వాతావరణం, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, రోగులకు అనుకూల సౌకర్యాలు,సదుపాయాలు అందుబాటులో ఉండటం వల్ల స్థానికంగానే చికిత్స పొందేలా ఆసుపత్రి ఉద్యోగుల్లో నమ్మకం పెరుగుతోందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కుటుంబ సభ్యులకు అన్ని రకాలుగా సౌకర్యంగా ఉండటంతో ఉద్యోగులు కూడా తాము పనిచేస్తున్న ఆసుపత్రులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.ఉచిత చికిత్స కి కార్పొరేట్ ఆసుపత్రులలో అవకాశాలు ఉన్నప్పటికీ ఉద్యోగులు తాము పనిచేస్తున్న ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వైనం ఇటీవల ఏజెన్సీ ప్రాంతాల్లో మెరుగైన నాణ్యమైన ఆధునిక వైద్య సేవలకు నిదర్శనం గా చెప్పవచ్చు .

## మారుమూల గిరిజన ప్రాంతమైన పొగిళ్లను

# సందర్శించిన జిల్లా కలెక్టర్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ జిల్లా, చందంపేట మండలం,పొగిళ్ల ,కంబాలపల్లిల లో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.మంగళవారం ఆయన దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, జిల్లా అధికారులతో కలిసి పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాలను సందర్శించారు. ముందుగా గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్లు , గ్రామ సమస్యలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాల ను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. వంటగదిని ,పాఠశాలలో సౌకర్యాలు ,మధ్యాహ్న భోజనం, తదితర వివరాలను పరిశీలించడమే కాకుండా, తనిఖీ చేశారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల తరగతిగదితోపాటు, తాగునీరు,కిచెన్ ఇతర పనులన్నింటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీతో తీర్మానం చేయించి అంచనాలు పంపించి పనులు చేపట్టి పూర్తి చేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఎలా చదువుతున్నారని? విద్యార్థులను ప్రశ్నించడమే కాకుండా, యూనిఫామ్ వేసుకోవాలని చెప్పి విద్యార్థులతో తెలుగు శతకాలు ,పద్యాలు చదివించారు. విద్యార్థులు మధ్యలో బడిమాని వేయకుండా చూడాలని, ఉపాధ్యాయులు రెగ్యులర్ గా పాఠశాలకు వచ్చేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలో గ్రామస్థులతో మాట్లాడారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ను పరిశీలించారు. పిల్లలతో అంగన్వాడి కేంద్రం ద్వారా ఇస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి టీచర్ తో విద్యార్థులకు బోధించే కథలు, ఆట,పాటలు, అన్నింటిని అడగడమే కాకుండా పిల్లల కు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రానికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా విద్యుత్తు ఇస్తున్నందున తక్షణమే ఫ్యాను, లైట్లు ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఆ తర్వాత పల్లె దవ ఖానాను సందర్శించి ప్రజలకు అందిస్తున్న వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ రెగ్యులర్గా పల్లె దవఖానను సందర్శించాలని ఆదేశించారు. ప్రస్తుతం నర్సు వైద్య సేవలు అందిస్తున్నదని, రోగం తీవ్రతను బట్టి ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రం, లేదా ఆస్పత్రికి పంపించాలని ఆదేశించారు. గ్రామంలో పరిశుభ్రత ఉండేలా చర్యలు చేపట్టాలని సర్పంచ్ జటావత్ జయేందర్ ను, కార్యదర్శి రవిని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇదే మండలం, కంబాలపల్లి సర్పంచ్ గోవిందు నివసిస్తున్న రేకుల వలయం తండాను సందర్శించి అక్కడ పాఠశాలలో ఉపాధ్యాయుడు రావడం లేదని తెలుసుకొని తక్షణమే ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు, ప్రహరీ నిర్మాణం, తాగునీరు కిచెన్ షెడ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మీటింగ్ లో తీర్మానం చేసి అంచనాలు రూపొందించి పంపించాలని ,నిధులు విడుదల చేస్తామని చెప్పారు.జిల్లా కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి ,జిల్లా అధికారులు డిపిఓ శంకర్ నాయక్ ,డి ఈ ఓ బిక్షపతి, జిల్లా సంక్షేమ అధికారి. కృష్ణవేణి, ఆర్డబ్ల్యూఎస్ ,ట్రాన్స్కో, మైనింగ్ తదితర శాఖ అధికారులు ,చందంపేట తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, తదితర అధికారులతో పాటు ,పొగిళ్ల, కంబాలపల్లి సర్పంచులు తదితరులు ఉన్నారు.



# ఖర్మ కాండ భవన్ కొరకు స్థల పరిశీలన



ప్రజాస్ఫూర్తి/సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపం లో పేద ఆర్యవైశ్యులు మరణిస్తే వారి ఖర్మ కాండల కొరకు మంగళ వారం జిల్లా ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షులు రాచకొండ శ్రీనివాసు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మిత్రులు స్థల కొనుగోలు కొరకు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్య వైశ్య మిత్రులు మాట్లాడుతూ అగ్ర కుల ఆర్యవైశ్యులలో కూడా ఎంతో మంది పేద ఆర్యవైశ్యులు ఉన్నారని,సొంత ఇండ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటూ జీవనాన్ని కొనసాగుతున్నారని తెలిపారు. కుటుంబ సభ్యులలో ఎవరైనా మరణిస్తే అద్దె యజమానులు దహన సంస్కారాలకు అంగీకరించక పోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురై తున్నారని,వారి కొరకు కర్మకాండ భవన్ నిర్మించినట్లు ఐతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆధ్యాత్మిక, సమాజ సేవ,దాన ధర్మాల్లో ముందు ఉండే ఆర్యవైశ్యులు పేద ఆర్య వైశ్యుల కొరకు నిర్మించే ఈ భవన్ కు ఆర్థికంగా ఉన్న ఆర్య వైశ్యులు సహరించాలని తెలిపారు.స్థలం పరిశీలించిన వారిలో ఆర్య వైశ్య నాయకులు రాచకొండ శ్రీనివాస్ కలకోట లక్ష్మయ్య ,బెలిదే శ్రీనివాసు బిక్కుమల్ల కృష్ణ, వెంపటి శబరినాథ్ వంగవీటి రమేష్, బచ్చు పురుషోత్తం, సోమా ప్రవీణ్ కుమార్,శ్రీరంగం రాము,యమా సంతోష్,మంచాల చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# సింగరేణి కార్మికులతోనే బొగ్గు వెలికితీత పనులు చేపట్టాలి

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వికెసిఎం ఓపెన్ క్యాస్టులో సింగరేణి సంస్థ యంత్రాలతో, సింగరేణి కార్మికులతోనే బొగ్గు వెలికితీత పనులు చేపట్టాలని, ప్రైవేటీకరణవైపు యాజమాన్యం మొగ్గు చూపితే ప్రతిఘటిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షను సాబీర్ పాషా ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ వికె సిహెచ్పి క్రషర్ల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించే కుట్రలు చేస్తున్నారని, ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలన్నారు. కొత్తగూడెం పివికె5 ఇంక్లైన్ నుండి వెళ్లి సత్తుపల్లిలో సుదీర్ఘకాలంగా డెప్యూటేషన్ పై పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్లను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా మార్పు చేసి, వారికి తిరిగి కొత్తగూడెం ఏరియాలో పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో జికె ఓపెన్ క్యాస్ట్ నుండి సత్తుపల్లికి వెళ్లిన సింగరేణి ఉద్యోగులందరినీ తక్షణమే వికెసిఎం ఓసికి వెనక్కి తీసుకురావాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. సంస్థ లాభాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనం చెల్లించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం తగదని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర నాయకులు వంగ వెంకట్, జి వీరాస్వామి, వి .మల్లికార్జున్ రావు, ఎస్ వి రమణమూర్తి, ఎస్ నాగేశ్వర్ రావు, చందర్ రావు, రాములు, బండారు మల్లయ్య, కార్పొరేటర్ మునిగడప పద్మ, మునిగడప వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై యుద్ధాన్ని వ్యతిరేకించండి

*** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర నాయకులు బాలచంద్ర**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ బాలచంద్ర సడంగి అన్నారు. మంగళవారం కొత్తగూడెం రైటర్ బస్తిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయిల్ ఒక పాఠశాల మీద జరిపిన దాడిలో 150 మంది విద్యార్థులు చనిపోయారని అన్నారు. ఒకపక్క ఒమన్ దేశం మధ్యవర్తిత్వంతో అమెరికాకు ఇరాన్‌కు మధ్య చర్చలు జరుగుతుండగానే అమెరికా దాని మిత్ర దేశం ఇజ్రాయిల్ ఈ దాడులకు ఒడిగట్టాయని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గౌని ఐలయ్య, జి ఝాన్సీ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు, ఎన్డీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.కె.ఉమర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జె సీతారామయ్య, కొత్తగూడెం ఏరియా కార్యదర్శి ఎన్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం కమిటీని స్వాగతిస్తున్నాం

* **తొలి దశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల అధ్యక్షుడు చక్రహరి రామరాజు**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించుటకు త్వరలోనే ఒక కమిటీని వేస్తామని ప్రకటించి నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్ లో గల మహాత్మ జ్యోతిబాపూలే బీసీ భవన్ లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ లు త్వరలోనే ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించుటకు ఒక కమిటీని వేస్తామని చెప్పారని ఈ కమిటీని త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. 2014 ముందు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గత 60 సంవత్సరాల నుండి జరిగిన ఉద్యమాల అన్నింటిలోకి 1969 తెలంగాణ ఉద్యమ మే కీలకమని ఆ ఉద్యమ స్ఫూర్తితోనే మలి ఉద్యమం జరిగి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నా రు. ఆ ఉద్యమంలో విద్యార్థులు ఒక సంవత్సరం మొత్తం ఉద్యమంలో కీలకంగా పాల్గొని ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోయినారని 369 మంది యువకులు విద్యార్థులు పోలీసు తూటాలకు బలైనారని ఆనాటి పోలీసుల దమనకాండలో నిత్యం పోలీసులాటి దెబ్బలు తిని కేసుల్లో ఇరుక్కుని జైలుకు వెళ్లి అనేక ఇబ్బందులకు గురై నారు వయసు మళ్ళిన అదే ఉద్యమ స్ఫూర్తితో మలి ఉద్యమంలో కూడా పాల్గొన్నారని తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వ దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లిన పట్టించుకోలేదని ఈ ప్రభుత్వమైన తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీ ల అమలులో భాగంగా ఉద్యమకారులను ఆదుకుంటామని వారికి 250 గజాల స్థలము పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని మేనిఫెస్టోలో పెట్టినారు కానీ ఈ ప్రభుత్వం కూడా ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిన మొన్నటి వరకు ప్రభుత్వంలో ఎవరు ఈ విషయం మాట్లాడలేదు ఈ మధ్యలో ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకుంటామని ప్రకటన చేశారని అందుకు అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మారం సంతోష్ రెడ్డి వనం చంద్రమౌళి ఏళ్ల చంద్రారెడ్డి బొమ్మిడి లక్ష్మీనారాయణ కూతురు కృష్ణమూర్తి కొట్టం రవి ఈశ్వరరావు వెంకటేశ్వరరావు బండ్ రుద్రమ్మ కంది సూర్యనారాయణ బూరుగు మల్లయ్య గంగుల సత్యనారాయణ కోత్వాల్ సత్యనారాయణ కోయల వెంకట నారాయణ విద్యాసాగర్ రావు తదితరులు పాల్గొన్నారు

## ఎల్లమ్మ తల్లి చల్లని చూపులు మనందరిపై ఉండాలి

: **ఎంపీ రఘునందన్ రావు**



పటాన్ చెరు (జిన్నారం),: జిన్నారం మున్సిపల్ ప్రజలపై ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు కోరారు. మంగళవారం జిన్నారం మున్సిపల్ పరిధిలోని జంగంపేట గ్రామంలోని ఎల్లమ్మ ఆలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు, ప్రాంత అభివృద్ధి కోసం దేవత అనుగ్రహం అవసరమని పేర్కొన్నారు. గ్రామాల్లో శాంతి, సుభిక్షం నెలకొనాలని ప్రార్థించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించటం ఆనందదాయకమని తెలిపారు.బిజెపి కౌన్సిలర్ స్వప్న రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ పాల్గొని స్థానికులతో మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు జగన్ రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రేపు హకీంపేట క్రీడా పాఠశాలలో అడ్మిషన్స్‌కై ఎంపికలు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:హకీంపేట క్రీడా పాఠశాలలో చదువుకోదలచిన విద్యార్థుల ఎంపికలో భాగంగా ఈనెల 26వ తేదీన చుంచుపల్లి మండలం స్థాయి ఎంపికలను రామవరంలోని భారత్ పబ్లిక్ స్కూల్ లో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బి.నీరజ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపిక పోటీల్లో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు ఒరిజినల్, 3వ తరగతి విద్యార్హత, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్, కమ్యూనిటీ సర్టిఫికెట్, ఆరు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్థాయిలో జరగనున్న ఎంపికలకు పంపనున్నట్లు ఎంఈవో నీరజ వివరించారు. వివరాలకు 9440294121ను సంప్రదించాలని కోరారు.

## కంకర క్రషర్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

* **గ్రామంలో నిర్వహించకపోవడం పై విమర్శలు**




జిన్నారం, ప్రజాస్ఫూర్తి : జిన్నారం మండల గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం గ్రామం సర్వే నంబర్ 210లో కంకర క్రషర్ ఏర్పాటుకు సంబంధించి మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అధ్యక్షత వహించగా, ఆర్డీవో పాండు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కుమార్ పాటక్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. గ్రామస్తులు, స్థానిక నాయకులు, ఎన్జీవో ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు కంకర క్రషర్ ఏర్పాటును స్వాగతిస్తూ, ఇది గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. పరిశ్రమ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, స్థానిక ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలని కోరారు.ప్రత్యేకంగా గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు మెరుగుపర్చాలని గ్రామస్తులు అధికారులను కోరారు. పరిశ్రమ వల్ల కలిగే పర్యావరణ ప్రభావాలను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు.

## చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా

: **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉప్పల్ నియోజకవర్గంలోని చర్లపల్లి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. కుషాయిగూడ పోచమ్మ గుడి సమీపంలో స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనులతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గి, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం చక్రిపురం కాలనీలో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన చేసి, రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. టీచర్స్ కాలనీలో కూడా సీసీ రోడ్ పనులను ప్రారంభించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమ శేఖర్ రెడ్డి, మహేష్‌గౌడ్, పాండు ముదిరాజ్, పనగట్ల చక్రపాణి గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, చిత్తుల కిషోర్ గౌడ్, రాగుల వాసుదేవ ముదిరాజ్, సారా అనిల్ ముదిరాజ్, కొడకండ్ల యాదయ్య, సల్ల వెంకటేష్, బుడంపల్లి వెంకటేష్ గౌడ్. రాంగిరివార్ నర్సింగ్ రావు, శీలం అనిల్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతిపక్షమంటే ప్రభుత్వానికి లెక్క లేదు

* **హరీశ్‌రావు ధ్వజం**
* **శాసనసభ, మండలి నుంచి భారాస వాకౌట్**

హైదరాబాద్: శాసనసభ, మండలిలో సమయపాలన పాటించడం లేదని.. గవర్నర్ ప్రసంగంపై మాట్లాడేందుకు అవకాశమివ్వలేదని పేర్కొంటూ భారాస మంగళవారం వాకౌట్ చేసింది. మంగళవారం టీ విరామం అనంతరం శాసనసభలో భారాస డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టి.హరీశ్‌రావు మాట్లాడుతూ ‘‘పర్యాటకం, స్పోర్ట్స్, మైనార్టీ సంక్షేమం పద్దులు పెట్టలేదు. కనీసం చదివేందుకు అవకాశం ఇవ్వడం లేదు. రోజూ ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కావడం కాలేదు. టీబ్రేక్ 10 నిమిషాలు అని చెప్పి గంటల తరబడి వాయిదా వేసి, బెల్ కొట్టడం లేదు. పద్దుల పుస్తకాలు ఇవ్వనందుకు, గంటల తరబడి వాయిదా వేసినందుకు, గవర్నర్ ప్రసంగంపై అవకాశమివ్వనందుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం’ అని పేర్కొన్నారు. అనంతరం వెలుపల ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ‘‘ప్రధాన ప్రతిపక్షమంటే ఈ ప్రభుత్వానికి కనీస మర్యాద, గౌరవం లేదు.

## గ్యాస్ సబ్సిడీ డబ్బులు జమ చేయాలి: మునిగడప పద్మ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ సబ్సిడీ డబ్బులను తక్షణమే విడుదల చేయాలని కొత్తగూడెం కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా నాయకురాలు మునిగడప పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం 16వ డివిజన్లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు మూడు హామీలను ఇచ్చిందని, అందులో కేవలం ఉచిత బస్సు పథకం మాత్రమే అమలవుతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించి రెండు మూడు నెలలు మాత్రమే లబ్ధిదారుల అకౌంట్లో సబ్సిడీ వేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. సామాజిక పెన్షన్లు రూ.4 వేలు, వికలాంగుల పెన్షన్లు రూ.6 వేలకు పెంచుతామని మొదటి సంతకం పెట్టి నేటికీ అమలు కాకపోవడం వల్ల వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మీ పథకంలోని గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, ప్రతి మహిళకు రూ.2,500/- మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహిళలు నాయకురాలు బెల్లం బేబీ, రావిశెట్టి పద్మ, జయమ్మ, మాధవి, శాంతి, జమున, ఆసియా బేగం తదితరులు పాల్గొన్నారు

## పిల్లలకు డైట్ మెనూ ప్రకారం ఆహారం అందించాలి

* **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్,**



మహబూబాబాద్ జిల్లా , ప్రజాస్ఫూర్తి:జిల్లా కలెక్టర్ కురవి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు,ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని కిచెన్ షెడ్ , డైనింగ్ హాల్, టాయిలెట్స్ తరగతి గదులు పరిసరాలను పరిశీలించారు, విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే కామన్ డైట్ మెనూ పక్కాగా అమలు చేయాలని, ప్రతిరోజు అందించే ఆహారంలో నాణ్యత ,ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, షెడ్యూలు ప్రకారం పిల్లలకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, పాఠశాల ఆవరణంలోని పెండింగ్ లో ఉన్న టాయిలెట్, కిచెన్ షెడ్, వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, వైద్య పరీక్షలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించి అట్టి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు, పాఠశాల, వైద్యశాల తదితర ప్రదేశాలలో నిత్యం పరిశుభ్రంగా ఉంచుకొని సానిటేషన్ నిర్వహించాలని సూచించారు,మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో మంజూరు అయిన (18) ఇందిరమ్మ ఇండ్ల లో ఇప్పటివరకు (10 )స్లాబ్ లెవల్, జగ్గయ్య తండా లో (15) మంజూరు కాగా అందులో ( 9 ) స్లాబ్ లెవెల్ పూర్తి అయ్యాయని మిగతా ఇంటి నిర్మాణం కోసం సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్స్ పంచాయతీరాజ్ రెవెన్యూ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన మోటివేషన్ చేసి ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని, పూర్తిచేసిన లెవెల్ వరకు ఆన్లైన్ ద్వారా నమోదు చేసి డబ్బులు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, , హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హనుమ నాయక్, కురవి తహసిల్దార్ విజయ, ఎంపీడీవో కె.వీరబాబు, మండల విద్యాశాఖ అధికారి బలోజీ, తదితరులు ఉన్నారు.

## క్షయ రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

* **జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ క్షయ దినం మార్చ్ 24 సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చందం పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ క్షయ రహిత జిల్లా కోసం ప్రజలు భాగస్వామ్యం తో ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈసందర్భంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ రెండవ దశ వందరోజుల కార్యక్రమం ను అయన ప్రారంభించాడు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి గారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ ఏ ఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ క్యాంప్స్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరార. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ లు డాక్టర్ రాహుల్, డాక్టర్ దీప వివిధ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి డాక్టర్ రవి ప్రసాద్ చందం పేట సర్పంచ్ మహ్మద్ సాదిక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రాజేష్ , జిల్లా క్షయ నివారణ కార్యక్రమం సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.జిల్లా లో క్షయ నిర్మూలన కార్యక్రమం లో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి అవార్డు లు, ప్రశంస పత్రాలు అందించారు.

## ఖేలో ఇండియా ట్రైబల్స్ రెజ్లింగ్ పోటీలకు వెంకటప్రసాద్ ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఈనెల 26వ తేదీ నుండి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే ఖేలో ఇండియా ట్రైబల్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో జిల్లాకు చెందిన ఏ.వెంకట ప్రసాద్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొననున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఫేస్-2 ఖేలో ఇండియా ట్రైబల్స్ రెజ్లింగ్ జట్ల ఎంపిక పోటీలలో పలు అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీపడి అత్యంత ప్రతిభ కనబరిచి 4 స్థానంలో నిలిచి ఖేలో ఇండియా ట్రైబల్స్ రెజ్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు అర్హత సాధించారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ పి.కాశీ హుస్సేన్ వద్ద వెంకటప్రసాద్ శిక్షణ తీసుకుని గతంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ, ఫెడరేషన్ కప్, సీనియర్ నేషనల్ స్థాయిలలో అనేక రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని సత్తా చాటి బహుమతులు, పతకాలు గెలుపొందారు. ఇటీవల ఉత్తమ క్రీడాకారుడిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. ఖేలో ఇండియా ట్రైబల్ రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన వెంకటప్రసాద్‌ను జిల్లా క్రీడా అధికారి యం. పరంధామ రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి.నరేష్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నాగ సీతారాములు, ప్రధానకార్యదర్శి పి.కాశీ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఆదినారాయణ , పలు క్రీడాసంఘాల ప్రతినిధులు, కోచ్‌లు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## సిపిఎస్ ఉద్యోగుల డి ఎ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలి



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ మహబూబాబాద్.జీవో ఎంఎస్ నెంబర్.120 ద్వారా 17 వాయిదాల్లో, జీవో ఎంఎస్ నెంబర్.78 ద్వారా 28 వాయిదాల్లో, జీవో ఎంఎస్ నెంబర్ 2 ద్వారా 30 వాయిదాల్లో చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చినా, జిల్లాలో సిపిఎస్ ఉద్యోగుల డి ఎ పెండింగ్ ఏరియర్స్ లో చాలా తక్కువ వాయిదాలు మాత్రమే విడుదల అయ్యాయి. మిగిలిన ఏరియర్స్ ఇప్పటి వరకు ఉద్యోగుల ఖాతాల్లోకి జమ కాలేదు.వేలాది సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా దెబ్బతీస్తోంది. కాబట్టి, జిల్లాలోని అన్ని శాఖల సిపిఎస్ ఉద్యోగుల డి ఎ పెండింగ్ ఏరియర్స్ను వెంటనే (మిగిలిన అన్ని వాయిదాలు ఒకేసారి లేదా తక్కువ వాయిదాల్లో) విడుదల చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సోనుబోయిన రవిచంద్ర, రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర ఐటీ సెల్ కార్యదర్శి వీఎండి రఫిక్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పూసపాటి నాగముని, జిల్లా కోశాధికారి కొప్పుల నాగరాజు, ఐడిఓసి కన్వీనర్ మైస రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి నుంచే మత్తు పదార్థాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

* **జగద్గిరిగుట్ట సీఐ వెంకటేష్**






జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మత్తు పదార్థాల బారిన పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని, చిన్ననాటి నుంచే వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని జగద్గిరిగుట్ట సీఐ వెంకటేష్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని సంస్కృతి పాఠశాలలో జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ హజరై మాట్లాడారు. తెలియని వయసులో కొందరు మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. .‘‘దీపం కాలుతుందని తెలిసి ఎవరూ తాకరు... అదే విధంగా మత్తు పదార్థాల జోలికి కూడా పోకూడదని సూచించారు. సమాజంలో నకిలీ వస్తువులు ఎలా అందుబాటులో ఉన్నాయో, అదే విధంగా మత్తు పదార్థాలు కూడా సులభంగా లభిస్తున్నాయని తెలిపారు. అయితే వాటిని అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. బాలికలు ప్రతి విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. తెలిసినవారైనా, తెలియని వారైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనుకాకుండా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మార్గంలో సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని సీఐ వెంకటేష్ విద్యార్థులకు హితవు పలికారు. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించి, ఎవరైనా ప్రమాదంలో ఉంటే వారికి సహాయం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాలుష్యంలో నంబర్-1 పాక్.. ఇండియా స్థానం ఎంతంటే?

ప్రపంచంలోని అత్యంత కాలుష్య దేశంగా 2025లో పాకిస్థాన్ నిలిచింది. వాయు నాణ్యతను పర్యవేక్షించే స్విట్జర్లాండ్ సంస్థ ఐక్యూఎయిర్ మంగళవారం ఈ మేరకు ప్రకటన చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన పరిమితి కంటే ప్రమాదకరమైన పీఎం (పార్టిక్యులేట్ మ్యాటర్) 2.5 కణాల స్థాయిలు పాకిస్థాన్‌లో 13 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఆ దేశంలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉండడం వల్ల.. అక్కడి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని వెల్లడించింది. అత్యంత కలుషితమైన దేశాల జాబితాలో బంగ్లాదేశ్, మధ్య ఆసియా దేశమైన తజికిస్థాన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ జాబితాలో భారత్ ఆరో స్థానంలో ఉంది. మొత్తం 143 దేశాల్లో వాయు నాణ్యత పరీక్షలు నిర్వహించగా.. వాటిలో 130 దేశాలు డబ్ల్యూహెచ్‌వో సూచించిన వాయునాణ్యత ప్రమాణాల అమల్లో విఫలమయ్యాయి. మరోవైపు ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే నగరాల జాబితా 2025లో ఢిల్లీ సమీపంలోని



'లోని' నగరం మొదటి స్థానంలో ఉంది. దీని తర్వాతి స్థానంలో చైనాలోని హోటాన్ ఉంది. ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం కలిగిన 25 నగరాలు.. భారత్, పాకిస్థాన్, చైనాలోనే ఉండడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా కేవలం 14 శాతం నగరాలు మాత్రమే WHO ప్రమాణాలను అందుకున్నాయి. ఆస్ట్రేలియా, ఐస్‌లాండ్, ఎస్టోనియా, పనామాలో ఆ నగరాలు ఉన్నాయి.

## ఈ ఎన్నికల్లో పోటీ చేయట్లేదు: కమల్ హాసన్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ నటుడు, మక్కళ్ నీది మయ్యం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ కీలక ప్రకటన చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ నేరుగా పోటీ చేయబోదని ప్రకటించారు. డీఎంకే నేతృత్వంలోని కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. సీట్ల పంపకాలపై డీఎంకే, దాని మిత్రపక్షాలు ఒప్పందం ఖరారు చేసుకుంటున్న వేళ ఈ ప్రకటన వెలువడింది. కూటమిలో తమకు కేటాయించిన సీట్ల సంఖ్యతోపాటు డీఎంకే 'రైజింగ్ సన్' గుర్తుతో పోటీ చేయాలన్న ప్రతిపాదన తమకు అంత అనుకూలంగా లేదని ఎంఎన్‌ఎం అధ్యక్షుడు కమల్ హాసన్




పేర్కొన్నారు. అందుకే ఈ అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ మేరకు సుదీర్ఘ లేఖ విడుదల చేసిన కమల్ హాసన్.. పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కారుణ్య మరణం కేసు.. తుదిశ్వాస విడిచిన హరీశ్ రాణా

ప్రమాదవశాత్తు గాయపడి 13 ఏళ్ల క్రితం కోమాలో వెళ్లిపోయిన హరీశ్ రాణా తుదిశ్వాస విడిచినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇటీవల సుప్రీంకోర్టు కారుణ్య మరణాన్ని ప్రసాదించడంతో ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు అతడికి చికిత్స నిలిపివేశారు. దాంతో మంగళవారం రాణా మృతి చెందారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

**ఎవరీ హరీశ్ రాణా..?**

ఢిల్లీ సమీప గాజియాబాద్‌కు చెందిన 32 ఏళ్ల హరీశ్ రాణా పంజాబ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో 2013 ఆగస్టు 20న వసతి గృహ భవనం నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద



పడిపోయాడు. తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లిపోయాడు. ప్రముఖ ఆసుపత్రుల్లో చికిత్స అందించినా, అతని ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. అప్పటినుంచి అతడు కోమాలోనే ఉండిపోయాడు. కుమారుడి చికిత్స కోసం ఆర్థికంగా, మానసికంగా చితికిపోయిన ఆ తల్లిదండ్రులు అతడి కారుణ్య మరణానికి అనుమతించాలంటూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వైద్య నివేదికలు పరిశీలించిన అనంతరం రాణాకు చికిత్స నిలిపివేయొచ్చని రెండువారాల క్రితం న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఈ తరహా తీర్పు వెలువరించడం ఇదే మొట్టమొదటిసారి. ఈ తీర్పు అనంతరం మార్చి 14న రాణాను గాజియాబాద్‌లోని ఇంటి నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. అప్పటి నుంచి అందిస్తోన్న చికిత్సను దశలవారీగా తగ్గించారు. ఈ క్రమంలోనే అతడు తుదిశ్వాస విడిచాడు.

## ఉచితంగా ఫ్రిజ్.. పురుషులకూ
## ఉచిత బస్సు ప్రయాణం అన్నాడీఎంకే మేనిఫెస్టో

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ప్రధాన పార్టీల మేనిఫెస్టోల విడుదలతో తమిళనాట రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. తాజాగా అన్నాడీఎంకే తన ఎన్నికల హామీలను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే.. రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఉచిత ఫ్రిజ్‌లను అందిస్తామని హామీ ఇచ్చింది. మహిళల మాదిరిగానే పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని తీసుకొస్తామని



ప్రకటించింది. రూ.25 వేల రాయితీతో 5 లక్షల మంది మహిళా ఉద్యోగులకు ద్విచక్ర వాహనాలు అందిస్తామని తెలిపింది. వీటితోపాటు మరికొన్ని వరాలు కురిపించింది.

* **బ్యాంకుల నుంచి తీసుకున్న విద్యా రుణాలు మాఫీ**
* ప్రతి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం
* రేషన్‌కార్డు ఉన్నవారికి బియ్యంతోపాటు ఉచితంగా కిలో పప్పు, కిలో మంచినూనె
* ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
* జల్లికట్టు యోధుల కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థిక సాయం
* సామాజిక భద్రతా పింఛను రూ.2వేలకు పెంపు


## 'కొవిడ్' నాటి విషాదాలను మోదీ మర్చిపోయారా?: రాహుల్ గాంధీ

పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ పార్లమెంట్ ఉభయసభల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా 'కొవిడ్' ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందిస్తూ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా మహమ్మారి విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి మర్చిపోయారా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ.. ప్రధాని ప్రసంగంపై స్పందించారు. ''మన విదేశాంగ విధానాలను మోదీ తన వ్యక్తిగత విధానాలుగా మార్చారు. మోదీ రాజీ పడితే.. మన విదేశాంగ విధానం కూడా రాజీ పడినట్లే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్లే కన్పిస్తోంది'' అని ఆరోపించారు.



## గన్‌తో ఫొటోషూట్.. స్నేహితుడి ప్రాణాలు పణంగా..


సోషల్ మీడియా మోజులో పడి యువత ప్రాణాలను సైతం లెక్క చేయట్లేదు. గన్‌తో ఫొటోషూట్ చేయబోతే అదికాస్తా పేలడంతో ఓ యువకుడు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పుణెలోని కేశవనగర్‌కు చెందిన యువరాజ్ గైక్వాడ్ (19), ఓం దుర్గా గైక్వాడ్(19), సోను



(21), మరో మైనర్ బాలుడు కలిసి గన్‌తో ఫొటోషూట్, వీడియో తీసుకునేందుకు యత్నించారు. ఇందుకోసం లైసెన్స్ లేని దేశీయ తుపాకీని తీసుకొచ్చారు. దానితో పోజులిస్తూ ఒక్కొక్కరిగా ఫొటోలు తీసుకున్నారు. సోను ఫొటో కోసం గన్‌ను మైనర్ బాలుడికి గురిపెట్టి జోక్ చేశాడు. పొరపాటున అది పేలడంతో బుల్లెట్ బాలుడి నడుముకు తగిలింది. దీంతో భయపడిపోయిన ఆ స్నేహితులు.. తీవ్రంగా గాయపడిన బాలుడిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, సోనుతో పాటు మిగతా ఇద్దరినీ అరెస్టు చేశారు. ఇది కావాలని చేసిన పని కాదని, రీల్స్ మోజులో పడి ఆ యువకులు ఇలా చేశారని పుణె పోలీసులు తెలిపారు. అసలు ఆ తుపాకీ వీరి వద్దకు ఎలా వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కశ్మీరీ వేర్పాటువాది
## ఆసియా అంద్రాబీకి జీవితఖైదు


కశ్మీరీ వేర్పాటువాది, నిషేధిత ఉగ్రముఠా నాయకురాలు ఆసియా అంద్రాబీకి జీవిత ఖైదు పడింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం (UAPA) కింద నమోదైన కేసులో రెండు నెలల క్రితం ఆమెను దోషిగా నిర్ధరించిన ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం.. తాజాగా శిక్ష ఖరారు చేసింది. ఆమె సహచరులు సోఫీ ఫహ్మీదా, నహీదా నస్రీన్‌లకు 30 ఏళ్ల చొప్పున శిక్ష విధిస్తూ ఢిల్లీ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఉగ్ర కార్యకలాపాలకు కుట్ర పన్నారనే ఆరోపణలపై ఆసియా అంద్రాబీ సహా ముగ్గురు కశ్మీరీ వేర్పాటువాదులు 2018 ఏప్రిల్‌లో అరెస్టయ్యారు. యూఏపీఏ కింద అభియోగాలు నమోదు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ (NIA).. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం కలిగించేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపించింది.



కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు నిందితులు, వీరు నిర్వహిస్తున్న సంస్థపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ.. ఇటీవల దర్యాప్తు పూర్తిచేసింది. ఈ ఏడాది జనవరిలో వీరిని దోషులుగా తేల్చిన ఢిల్లీ అడిషనల్ సెషన్స్ కోర్టు తాజాగా శిక్ష ఖరారు చేసింది.

## మిలిటరీ అధికారిణులు శాశ్వత కమిషన్‌కు అర్హులే: సుప్రీంకోర్టు

మహిళలపై ఉన్న వ్యవస్థాగత పక్షపాతాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా ఖండించింది. సాయుధ బలగాలలో లింగ సమానత్వాన్ని బలోపేతం చేసే దిశగా సంచలన తీర్పు వెలువరించింది. సైనిక దళాల్లోని మహిళా షార్ట్ సర్వీస్ కమిషన్ (SSC) ఆఫీసర్లు శాశ్వత కమిషన్ అధికారిణులుగా మారేందుకు హక్కులు కల్పించింది. సంపూర్ణ న్యాయం అందించేందుకు రాజ్యాంగం ప్రకారం తనకున్న అసాధారణ అధికారాలను ఉపయోగించి ఈ నిర్ణయం తీసుకుంది. శాశ్వత కమిషన్ కేవలం పురుషులకే పరిమితం అవుతుందని ఇకపై పురుష షార్ట్ సర్వీస్ కమిషన్ అధికారులు (SSCOలు) ఆశించలేరని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. మహిళా ఎస్ఎస్‌సీఓలకు శాశ్వత కమిషన్‌ను నిరాకరించడం మన వ్యవస్థలో పాతుకుపోయిన వివక్ష ఫలితమేనని అభిప్రాయం వ్యక్తంచేసింది. ప్రతి ఏడాది 250 మంది అధికారిణులను మాత్రమే శాశ్వత కమిషన్‌లోకి తీసుకోవాలనే పరిమితిని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పురుష అధికారులతో సమానంగా మహిళలు



కూడా పదోన్నతి పొందనున్నారు. "మహిళలు శాశ్వత కమిషన్‌కు ఎప్పటికీ అర్హులు కారని భావించి వారి వార్షిక గోప్య నివేదిక(ఏసీఆర్)లను రూపొందించారు. దానివల్ల పురుషులతో పోలిస్తే మహిళా అధికారిణులపై ప్రతికూల ప్రభావం పడింది. వారి పనితీరు, యోగ్యతను పరిగణనలోకి తీసుకొని ఏసీఆర్‌లను ఎప్పుడూ రూపొందించలేదు. మూల్యాంకనంలోని లోపాలు వారి కెరీర్ పురోగతిని అడ్డుకున్నాయి. మహిళల శాశ్వత కమిషన్‌పై గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలులో జాప్యం జరిగింది. దీనివల్ల ఎందరో అధికారిణులపై ప్రభావం పడింది'' అని ధర్మాసనం పేర్కొంది. భారత వైమానిక దళంలో 2019లో ప్రవేశపెట్టిన కనీస పనితీరు ప్రమాణాలను అధికారులకు తగినంత సమయం ఇవ్వకుండా హడావిడిగా అమలుచేశారని సుప్రీంకోర్టు పేర్కొంది. అదే సమయంలో నౌకాదళంలో డైనమిక్ వేకెన్సీ మోడల్‌లో పారదర్శకత లోపించిందని తెలిపింది. ఎంపిక ప్రమాణాలు, మార్కులను రక్షణ మంత్రిత్వశాఖ, నౌకాదళం వెల్లడించకపోవడం వల్ల పురుష అధికారులకు సమస్యలు ఎదురయ్యాయంది.




## ఎన్నికల ముందు..
## బెంగాల్‌లో నాటుబాంబుల కలకలం

ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాల్‌లో నాటు బాంబులు తయారీ కలకలం సృష్టించింది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఓ ఇంట్లో పెద్ద మొత్తంలో నాటు బాంబులు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. ఘటనా స్థలంలో 22 నాటు బాంబులు సహా పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాంబు స్క్వాడ్ బృందం సహాయంతో బాంబులను నిర్వీర్యం చేసి, ఇంటిని సీజ్ చేశామన్నారు. ఇంటి యజమాని పరారీలో ఉన్నాడని.. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. శంకర్‌పుర్‌లోని ఓ మామిడి తోటలోనూ సోమవారం నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఎటువంటి ఉద్రిక్తతలు చెలరేగకుండా ఉండేందుకు భద్రతను కట్టుదిట్టం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బెంగాల్ అసెంబ్లీకి ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## పర్షియన్ గల్ఫ్‌లో సిద్ధంగా ఆరు ఎల్పీజీ ట్యాంకర్లు.. అవి దేశం చేరితే..!

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉండటంతో.. ఎల్పీజీ కొరత రాకుండా చూసుకునేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పర్షియన్ గల్ఫ్‌లో నిలిచిన మరికొన్ని ట్యాంకర్లను హర్మూజ్ జలసంధి దాటించేందుకు ఇరాన్ అధికారులతో కేంద్రం చర్చలు జరుపుతోంది. అవి ఒకే అయితే ఆరు ట్యాంకర్లు భారత్‌కు చేరుకుంటాయి. 3,00,000 టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత్ నౌకలకు దీర్ఘకాలిక గ్యారెంటీ లేకపోవడంతో.. ఎప్పటికప్పుడు ఇరాన్‌తో చర్చల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే అంతర్గత పరిస్థితుల దృష్ట్యా నౌకల అనుమతుల విషయంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) నిర్ణయం తీసుకోవడం ఆలస్యమవుతోంది. ఇదిలాఉంటే.. ఎల్పీజీని మోసుకొస్తోన్న జగ్ వాసంత్, పైన్ గ్యాస్ ట్యాంకర్లు హర్మూజ్‌ను దాటి, ఇప్పటికే అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అవి కొన్నిరోజుల్లో భారత్‌కు చేరుకోనున్నాయి. కాగా, తమ అధికారులతో సమన్వయం చేసుకొంటూ తటస్థ దేశాల నౌకలు హర్మూజ్ మీదుగా వెళ్లొచ్చని ఇరానియన్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరాన్ అధికారులు సహకార వైఖరిని అవలంబిస్తున్నారని భారత ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హర్మూజ్ నుంచి నౌకల రాకపోకల విషయంలో కాస్త సానుకూలత కనిపిస్తోంది.



# ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహం.. లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు భారీ లాభాలతో ముగిశాయి. ఆటో, బ్యాంకింగ్ స్టాక్ లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రోజంతా సానుకూలంగా కదిలి, గరిష్ఠ స్థాయిల వద్ద ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,372.06 పాయింట్లు పెరిగి 74,068.45 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 399.75 పాయింట్లు లాభపడి 22,912.40 వద్ద ముగిసింది.

అమెరికా, ఇరాన్ మధ్య భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చన్న ఆశలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపాయి. దీంతో మార్కెట్ సెంటిమెంట్ బలపడిందని విశ్లేషకులు తెలిపారు. ప్రధాన సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.60 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.63 శాతం చొప్పున లాభపడ్డాయి.

రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మీడియా ఇండెక్స్ 3 శాతానికి పైగా పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఆటో, బ్యాంకింగ్ రంగాలు కూడా మార్కెట్ ర్యాలీకి గణనీయంగా దోహదపడ్డాయి. అయితే, ఫార్మా రంగం మాత్రం మిగతా వాటితో పోలిస్తే స్వల్ప లాభాలకే పరిమితమైంది. టెక్నికల్‌గా, నిఫ్టీ స్వల్పకాలిక రికవరీకి సంకేతాలు ఇస్తోందని నిపుణులు చెబుతున్నారు. "నిఫ్టీకి 22,700 వద్ద తక్షణ మద్దతు ఉంది. 22,500--22,600 జోన్ కొనుగోళ్లకు కీలకమైన డిమాండ్ ఏరియాగా కొనసాగుతుంది," అని ఒక మార్కెట్ విశ్లేషకుడు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, స్టాక్ మార్కెట్లలో జోష్ ఉన్నప్పటికీ రూపాయి మారకం విలువ క్షీణించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడిచమురు ధరల కారణంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి 0.36 శాతం నష్టపోయి 93.90 వద్ద ట్రేడ్ అయింది. ఇది దేశ దిగుమతులపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు.

## భీమ్ యాప్‌లో సరికొత్త ఫీచర్..

**ఇక పిన్ లేకుండానే యూపీఐ పేమెంట్లు**

BHIM
BHARAT INTERFACE FOR MONEY

**న్యూఢిల్లీ:** యూపీఐ చెల్లింపులను మరింత సులభతరం, వేగవంతం చేసే దిశగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ముందడుగు వేసింది. ఎన్‌పీసీఐకు చెందిన ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్‌బీఎస్ఎల్), మంగళవారం భీమ్ పేమెంట్స్ యాప్‌లో సరికొత్త బయోమెట్రిక్ అథెంటికేషన్ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త అప్‌డేట్ ద్వారా వినియోగదారులు రూ. 5,000 వరకు జరిపే లావాదేవీలకు తమ స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర (ఫింగర్‌ప్రింట్) లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి సులభంగా ఆమోదం తెలపవచ్చు. ఈ ఫీచర్‌తో ప్రతి చిన్న లావాదేవీకి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం ఉండదు. చాలా సందర్భాల్లో పిన్ మర్చిపోవడం లేదా తప్పుగా నమోదు చేయడం వల్ల చెల్లింపులు విఫలమవుతుంటాయి. ఈ కొత్త విధానం ద్వారా అలాంటి ఇబ్బందులకు తెరపడుతుందని, చెల్లింపుల ప్రక్రియ మరింత సౌకర్యవంతంగా మారుతుందని ఎన్‌బీఎస్ఎల్ విశ్వాసం వ్యక్తం చేసింది. స్నేహితులు, కుటుంబ సభ్యులకు డబ్బు పంపడం, షాపుల్లో క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి రోజువారీ లావాదేవీలన్నింటికీ ఈ బయోమెట్రిక్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవచ్చు.

ఈ సందర్భంగా ఎన్‌బీఎస్ఎల్ ఎండీ, సీఈవో లలితా నటరాజ్ మాట్లాడుతూ.. డిజిటల్ చెల్లింపులను అందరికీ సులభంగా, సురక్షితంగా అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. "వినియోగదారులు తమ వేలిముద్ర లేదా ఫేస్ అన్‌లాక్ ద్వారా లావాదేవీలను నిర్ధారించడం వల్ల పిన్‌పై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో చెల్లింపులు యూజర్ బయోమెట్రిక్‌తో ముడిపడి ఉండటం వల్ల బలమైన భద్రత కూడా కొనసాగుతుంది" అని ఆమె వివరించారు. బయోమెట్రిక్ డేటా వినియోగదారుడి ఫోన్‌లోనే సురక్షితంగా నిల్వ ఉండటం వల్ల పిన్ షేరింగ్ వంటి ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు.

అయితే, భద్రత దృష్ట్యా రూ. 5,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు మాత్రం వినియోగదారులు తప్పనిసరిగా యూపీఐ పిన్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఇది పెద్ద మొత్తంలో జరిగే చెల్లింపులకు అదనపు రక్షణ కల్పిస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్.. ఫింగర్‌ప్రింట్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ సపోర్ట్ చేసే ఆండ్రాయిడ్, ఐఓఎస్ స్మార్ట్‌ఫోన్లలో అందుబాటులోకి వచ్చింది.

## జొమాటో బాటలో స్విగ్గీ..

**ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు**




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో బాటలోనే స్విగ్గీ కూడా పయనించింది. తన ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కో ఆర్డర్‌పై వసూలు చేసే ఈ రుసుమును రూ. 14.99 నుంచి రూ. 17.58కి పెంచింది. అంటే జీఎస్టీతో కలిపి దాదాపు 17 శాతం మేర ఛార్జీలు పెరిగాయి. పెరిగిన ఈ ఛార్జీలు స్విగ్గీ యాప్‌లో వినియోగదారులకు ఇప్పటికే కనిపిస్తున్నాయి.

కొన్ని రోజుల క్రితమే జొమాటో కూడా తన ప్లాట్‌ఫామ్ ఫీజును 19 శాతం పెంచిన విషయం తెలిసిందే. దీంతో ఒక్కో ఆర్డర్‌పై రూ. 2 అదనపు భారం పడింది. తాజా పెంపుతో స్విగ్గీ, జొమాటో రెండు యాప్‌లలోనూ ప్లాట్‌ఫామ్ ఫీజు జీఎస్టీతో కలిపి దాదాపు రూ. 17.58కి చేరింది. "ప్లాట్‌ఫామ్‌ను నిర్వహించడానికి, మెరుగైన సేవలు అందించడానికి" ఈ పెంపు దోహదపడుతుందని స్విగ్గీ తమ వినియోగదారులకు తెలియజేసింది.

నిర్వహణ ఖర్చులు పెరగడమే ఈ పెంపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఎల్‌పీజీ, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడంతో రెస్టారెంట్లు, డెలివరీ భాగస్వాములపై ఖర్చుల భారం ఎక్కువైంది. ఈ నేపథ్యంలోనే ఫుడ్ డెలివరీ సంస్థలు తమ మార్జిన్లను కాపాడుకోవడానికి ప్లాట్‌ఫామ్ ఫీజులను సవరిస్తున్నాయి. జొమాటో 2023 ఆగస్టులో రూ. 2తో ఈ ఫీజును ప్రారంభించి, దశలవారీగా పెంచుకుంటూ వచ్చింది.

కాగా, మంగళవారం ట్రేడింగ్‌లో స్విగ్గీ షేర్లు 0.33 శాతం లాభంతో రూ. 273.40 వద్ద ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్నాయి. గత నెలలో ఈ స్టాక్ 10 శాతానికి పైగా నష్టపోయింది. మరోవైపు ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు తర్వాత జొమాటో షేర్లు 2 శాతం మేర లాభపడటం గమనార్హం.

# రాజస్థాన్ రాయల్స్‌కు భారీ ధర.. వాటాదారుడే కొత్త బాస్..!




**రాజస్థాన్:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందే రాజస్థాన్ రాయల్స్ కొనుగోలు ప్రక్రియ ముగిసింది. మొదటి సీజన్ విజేతగా నిలిచిన రాజస్థాన్ ఫ్రాంచైజీకి వేలంలో భారీ ధర దక్కింది. ఇన్నాళ్లు ఫ్రాంచైజీ వాటాదారుల్లో ఒకరైన కల్ సమానీ రాజస్థాన్ జట్టును కొనేశాడు. రూ. 1.5 లక్షల కోట్లకు అతడు ఆర్ఆర్‌ను హస్తగతం చేసుకున్నాడు. ఫ్రాంచైజీకి చెందిన వంద శాతం షేర్లు కొన్న సమానీ పంతొమ్మిదో సీజన్ నుంచి రాజస్థాన్ యజమాని హోదాలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నాడు.

ఐపీఎల్ ఆరంభ సీజన్ విజేతగా చరిత్ర సృష్టించిన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం మారింది. ఊహించినట్టుగానే ఫ్రాంచైజీకి వేలంలో భారీ ధర దక్కింది. రాజస్థాన్ జట్టు వాటాదారుల్లో ఒకరైన కల్ సొమానీ 1.6 బిలియన్ డాలర్లు (భారతీయ కరెన్సీలో రూ. 1.5లక్షల కోట్లు) ఫ్రాంచైజీని సొంతం చేసుకున్నాడు. చివరిదాకా పోటీపడిన టైమ్స్ గ్రూప్ కంటే ఎక్కువ ధరతో సొమానీ టీమ్‌ను దక్కించుకున్నాడు.

**ఐపీఎల్‌లో కొత్త యజమాని**

అమెరికాలోని అరిజోనాకు చెందిన కల్ సోమానీకి గోల్ఫ్ అన్నా క్రికెట్ అన్నా చాలా ఇష్టం. మోటార్ సిటీ గోల్ఫ్ క్లబ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సొమానీ రాజస్థాన్ రాయల్స్‌లో వాటా కొన్నాడు. 2026 ఎడిషన్ తర్వాత ఫ్రాంచైజీని అతడు కొనాలనుకున్నాడు. కానీ, వాటాదారులంతా ముందుగానే అమ్మకానికి పెట్టడంతో తానే దక్కించుకోవాలని సొమానీ భావించాడు.

ఫ్రాంచైజీలో అత్యధికంగా 65 శాతం వాటా కలిగిన మనోజ్ బడలే.. ఇతరుల షేర్లను కూడా కొనేసి ఐపీఎల్‌లో కొత్త యజమానిగా అవతరించాడు. 19వ సీజన్‌లో రియాన్ పరాగ్ సారథ్యంలో రాజస్థాన్ రాయల్స్ బరిలోకి దిగుతోంది. మార్చి 30న తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను రాజస్థాన్ ఢీకొట్టనుంది.

**ఆకాశ్ దీప్, ఎడ్వర్డ్స్ స్థానాల్లో**

# సౌరబ్ దూబే, పెయిన్







**న్యూఢిల్లీ:** మరో నాలుగు రోజుల్లో ఐపీఎల్ ప్రారంభంకానున్నది. ఈ నేపథ్యంలో కొన్ని జట్లు గాయపడ్డ ప్లేయర్ల స్థానంలో కొత్త క్రికెటర్లను తీసుకున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కొత్త ప్లేయర్లను ప్రకటించింది. గాయపడ్డ ఆకాశ్ దీప్ స్థానంలో సౌరబ్ దూబేను తీసుకుంటున్నట్లు కేకేఆర్ వెల్లడించింది. ఇక జాక్ ఎడ్వర్డ్స్ స్థానంలో డేవిడ్ పెయిన్‌ను తీసుకుంటున్నట్లు ఎస్ఆర్‌హెచ్ ప్రకటించింది. భారత పేస్ బౌలర్ ఆకాశ్ దీప్.. ఐపీఎల్ టోర్నీ నుంచి మొత్తానికి దూరం అయ్యాడు. అతను తీవ్రమైన నడుము నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. బెంగుళూరులో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వైద్య బృందం సమక్షంలో అతను కోలుకోనున్నాడు.

ఆకాశ్ స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ పేస్ బౌలర్ సౌరభ్‌ను తీసుకున్నట్లు కేకేఆర్ ప్రకటించింది. 30 లక్షలకు అతను కేకేఆర్‌తో కలుస్తున్నాడు. 28 ఏళ్ల సౌరభ్.. విదర్భ జట్టు తరపున ఆడుతాడు. అయితే ఇప్పటి వరకు అతను ఐపీఎల్‌లో ఆడలేదు. తొలిసారి ఈ టోర్నీలో అరంగేట్రం చేయనున్నాడు. గతంలో అతను సన్‌రైజర్స్ బృందంలో ఉన్నాడు. ఇక ఇంగ్లండ్ పేసర్ పెయిన్ .. హైదరాబాద్ జట్టు తరపున ఆడనున్నాడు. పాదం గాయం వల్ల జాక్ ఎడ్వర్డ్స్ దూరం కాగా, అతని స్థానంలో పెయిన్‌ను తీసుకున్నారు.అయితే పెయిన్ కోసం ఎస్ఆర్‌హెచ్ 1.5 కోట్లు వెచ్చించింది.

# ఉప్పల్ స్టేడియానికి కొత్త కళ...

**రూ.10 కోట్లతో అభివృద్ధి చేసిన సన్ గ్రూప్**



**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సరికొత్త హంగులను సంతరించుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్య సంస్థ అయిన సన్ గ్రూప్, స్టేడియం ఆధునికీకరణ పనులను భారీ ఎత్తున చేపట్టింది. ఈ పనుల కోసం రూ.10 కోట్లకు పైగా వ్యయం చేసినట్టు సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తెలిపింది.

ఈ ఆధునికీకరణలో భాగంగా స్టేడియంలోని ప్రేక్షకులు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు. స్టేడియం వ్యాప్తంగా ఉన్న 46 టాయిలెట్లను, ఒక లాంజ్‌తో సహా 42 బాక్సులను పూర్తిగా పునరుద్ధరించారు. దీంతో పాటు, కొత్తగా రెండు ఎలివేటర్లను (లిఫ్టులు), 43 ఎయిర్ కండిషనర్లను (ఏసీలు) ఏర్పాటు చేశారు. ఈ మార్పులతో స్టేడియం సదుపాయాలు కొత్తరూపు సంతరించుకున్నాయి.

స్టేడియంలో చేపట్టిన ఈ అభివృద్ధి పనుల వివరాలను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వెల్లడించింది. రాబోయే క్రికెట్ మ్యాచ్‌లకు హాజరయ్యే అభిమానులకు ఈ కొత్త సౌకర్యాలు మెరుగైన అనుభూతిని అందించనున్నాయి.

# మ్యాచ్ విన్నర్‌కు షాకిచ్చిన ఆర్సీబీ..

**అత్యాచార నిందితుడు యశ్ దయాల్‌పై వేటు..!**




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు షాకింగ్ నిర్ణయం తీసుకుంది. అత్యాచార నిందితుడైన పేసర్ యశ్ దయాల్‌పై వేటు వేసింది ఆర్సీబీ. ఈ ఏడాది దయాల్ తమ ఫ్రాంచైజీ తరఫున ఆడడం లేదని డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ మో బొబత్ వెల్లడించాడు. అయితే.. అతడి కాంట్రాక్ట్‌ను మాత్రం రద్దు చేయడం లేదని బొబత్ తెలిపాడు. ప్రస్తుత పరిస్థితుల్లో అతడిని ఆడించవద్దని ఫ్రాంచైజీ భావిస్తున్నట్టు బొబత్ పేర్కొన్నాడు. పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్‌కు పలువురు ఆటగాళ్లు దూరమవుతున్నారు. వీరిలో చాలామంది గాయం కారణంగా టోర్నీకి అందుబాటులో ఉండడం లేదు. ఆర్సీబీ ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ కొన్ని మ్యాచ్‌లకు దూరం కానుండగా.. యువ పేసర్ యశ్ దయాల్ ఏకంగా సీజన్ మొత్తం దూరమవ్వనున్నాడు. అలాగని అతడు గాయపడలేదు. బెంగళూరు యాజమాన్యమే అతడిపై వేటు వేసింది. అత్యాచారం కేసులో నిందితుడైన దయాల్‌కు ఈసారి స్క్వాడ్‌లో చోటు లేదని ఆర్సీబీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ మో బొబత్ స్పష్టం చేశాడు. 'యశ్ దయాల్ ఆర్సీబీ స్క్వాడ్‌లో చేరడం లేదనే విషయాన్ని మీ అందరికి తెలియజేస్తున్నా. ప్రస్తుతం అతడు వ్యక్తిగత జీవితంలోని కొన్ని పరిస్థితులు ఎదుర్కొంటున్నాడు. ఇప్పటివరకూ మేము అతడికి మద్దుతుగా నిలిచాం. పంతొమ్మిదో సీజన్ కోసం మేము దయాల్‌ను అట్టిపెట్టుకోవడం ద్వారా ఈ విషయం స్పష్టమవుతుంది. అయితే.. అతడి కాంట్రాక్ట్ కొనసాగుతుంది. దయాల్‌తో మేము తరచూ మాట్లాడుతున్నాం. ఈ రోజు ఉదయం కూడా నేను అతడితో మాట్లాడాను. ప్రస్తుత పరిస్థితుల్లో అతడిని ఫ్రాంచైజీకి దూరంగా ఉంచడమే మంచిదని భావించాం. అందుకే స్క్వాడ్‌లో అతడు చేరడం లేదు. ఈ విషయంపై ఇప్పుడే కామెంట్ చేయదలచుకోలేదు' అని మీడియా సమావేశంలో బొబత్ వెల్లడించాడు.

డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ ఈసారి బౌలింగ్ కష్టాలు ఎదుర్కొంటోంది. ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ గాయం నుంచి కోలుకోలేదు. అతడు కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యేలా ఉన్నాడు. యశ్ దయాల్ సైతం ఆడడం లేదు. దాంతో, బౌలింగ్ భారం రసిక్, మంగేశ్ వంటి కుర్రాళ్లపై పడనుంది. మార్చి 28న జరిగే ఆరంభ పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆర్సీబీ తలపడనుంది.

## పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి



**టాకీస్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది సౌండ్ గట్టిగా ఉంటుందని నమ్ముతున్నారు మెగాభిమానులు.

## శ్రీలీల ట్రాక్ చూసేందుకు మహిళల ఆసక్తి

### ఉస్తాద్ భగత్ సింగ్‌పై హరీష్ శంకర్



**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. తాజాగా దీని ప్రచారంలో భాగంగా హరీశ్ శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాకు వస్తున్న స్పందనపై ఆయన మాట్లాడుతూ.. సెకండ్ హాఫ్‌లో వచ్చే శ్రీలీల ఎపిసోడ్ మహిళా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోందని తెలిపారు. 'నిజం చెప్పాలంటే.. రెండో భాగంలో శ్రీలీల ట్రాక్ చూడటం కోసమే మహిళలు భారీగా థియేటర్లకు వస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను రెండు గంటల పాటు అభిమానులు వారు కోరుకున్నవిధంగా చూసుకోదగ్గ చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి ఆస్వాదించేలా ఉంది. నేను ఈ చిత్రం విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను' అని అన్నారు.




## మహానటి సినిమా చేసినందుకు నన్ను ట్రోల్ చేశారు..

### కీర్తిసురేష్ షాకింగ్ కామెంట్స్

**టాకీస్:** నేను శైలజ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది హీరోయిన్ కీర్తి సురేష్. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ అమ్మడు.. ఆ తర్వాత మహానటి సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యింది. అలనాటి హీరోయిన్ సావిత్రి జీవితకథగా వచ్చిన ఈ చిత్రంలో మహానటి సావిత్రి పాత్రలో కీర్తి అద్భుతంగా నటించింది. తన నటనతో సావిత్రినే మరిపించి ఆడియన్స్ హృదయాల్లో మహానటిగా పేరు సంపాదించుకుంది. ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి అగ్రకథానాయికగా వరుస హిట్లతో సక్సెస్ ఫుల్ గా రాణిస్తోంది. ప్రస్తుతం తెలుగు , తమిళ్ తో పాటు హిందీలోనూ సినిమాలు చేస్తుంది ఈ వయ్యారి భామ. గతంలో కీర్తిసురేష్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన ఫిల్మ్ కెరియర్.. సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది కీర్తి సురేష్. ఆమె మాట్లాడుతూ.. మహానటి చిత్రాన్ని ఓకే చేసినందుకు తనను కొందరు ట్రోల్ చేశారని.. ఆ సినిమా పూర్తయ్యాకే ఈ విషయం తనకు తెలిసిందని చెప్పుకొచ్చింది. తనపై వచ్చిన విమర్శలు పక్కనపెడితే సావిత్రమ్మ పాత్రలో నటించినందుకు చాలా గర్వంగా ఉందన్నారు కీర్తి. "మహానటి చిత్రంలో నటించేందుకు ముందుగా ఒప్పుకోలేదు. సావిత్రమ్మ పాత్రలో నటించేందుకు చాలా భయమేసింది. కానీ దర్శకుడు నాగ్ అశ్విన్ నన్ను ప్రోత్సహించారు. నువ్వు చేయగలవు అనే ధైర్యనిచ్చారాయన. ఆయనకే అంత నమ్మకం ఉంటే.. నేను ఎందుకు భయపడాలి అనుకున్నాను. అలాగే మహానటి పూర్తిచేశా. ఆ పాత్రలోనటిస్తున్నందుకు కొంత మంది నన్ను ట్రోల్ చేశారు. ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్నప్పుడు దీనిపై ప్రశ్న ఎదురైంది. అప్పుడు తెలిసింది నాపై ట్రోల్స్ వచ్చాయని. సోషల్ మీడియాలో నాపై వచ్చే నెగెటివిటీపై పెద్దగా ఆసక్తి చూపను. అందుకే నాపై ట్రోల్స్, విమర్శలు రావు. సావిత్రమ్మకు బయోపిక్ లో నటించడం భయంగా అనిపించింది.

## అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు

### సోషల్ మీడియాలో లయన్ పోస్టర్‌పై ఆసక్తి

**టాకీస్:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ



పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్టాటజీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.

## ధురంధర్-2కు రజనీకాంత్ ప్రశంసలు


టాకీస్: తాజా బ్లాక్‌బస్టర్ 'ధురంధర్ 2'పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనాన్ని చూసి.. ఆదిత్య ధర్ పనితీరును మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆదిత్యను 'బాక్సాఫీస్ కా బాప్' అని ప్రశంసించడమే కాకుండా సినిమా అద్భుతంగా ఉందని రజనీకాంత్ కొనియాడారు. ఈ సందర్భంగా హీరో రణవీర్ సింగ్, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా అని అన్నారు. రజనీకాంత్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తలైవా పోస్ట్‌కు ఆదిత్య ధర్ ఎమోషనల్ రిప్లై పెట్టారు. 'మేమందరం వినోదం అనే పదానికి మీ ఒక్కరినే బెంచ్‌మార్క్‌గా చూస్తూ పెరిగాము. దశాబ్దాలుగా మమ్మల్ని విజిల్స్ వేయించేలా, నవ్వించేలా, భావోద్వేగానికి గురయ్యేలా.. మీరు వినోదానికి అసలైన అర్థం చెప్పారు. ఇప్పటికీ అదే స్టైల్.. అదే గ్రేస్‌తో మీరు చేస్తున్న మ్యాజిక్ అద్భుతం. అలాంటిది మీరు 'ధురందర్ 2'ను తప్పక చూడాల్సిన చిత్రం అని చెప్పడం నా జీవితంలో అతిపెద్ద 'సూపర్‌స్టార్' మూమెంట్‌గా అనిపిస్తోంది. పెద్ద కలలు కనేలా మమ్మల్ని ప్రోత్సహించిన వ్యక్తి నుంచి అందిన ఈ ప్రశంస ఒక వరంలా ఉంది. మీ మాటలకు నా హృదయం ఉప్పొంగుతోంది' అని దర్శకుడు తన పోస్ట్‌లో



రాసుకొచ్చారు. మార్చి 19న విడుదలైన 'ధురంధర్ 2' చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఇప్పటికే రూ.750 కోట్ల మార్కును దాటి రికార్డులు తిరగరాస్తోంది. రజనీకాంత్‌తో పాటు అల్లు అర్జున్, మహేశ్ బాబు, నాగార్జున వంటి ఇతర అగ్ర తారలు కూడా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మోహన్‌లాల్

టాకీస్: మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తన పేరు, గొంతు, ఫోటోలు, సంతకం లేదా తన నటనకు సంబంధించిన ప్రత్యేకమైన హావభావాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ వాడుకోకుండా చూడాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన రూపాన్ని మార్చడం , తన గొంతును అనుకరిస్తూ తప్పుడు ప్రకటనలు చేయడం వంటివి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ ఎ÷-లాట్‌ఫారమ్‌లు, అనామక వ్యక్తులు తన 'మోహన్ లాల్' అనే బ్రాండ్‌ను అక్రమంగా వాడుకోకుండా వెంటనే స్టే ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించనుంది. గతంలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, సోనాక్షి సిన్హాతో పాటు టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కూడా తమ ఇమేజ్ దుర్వినియోగం కాకుండా ఇదే తరహాలో ఢిల్లీ హైకోర్టు నుండి రక్షణ పొందిన విషయం తెలిసిందే. కోర్టు గనుక మోహన్ లాల్‌కు అనుకూలంగా తీర్పునిస్తే, ఆయన అనుమతి లేకుండా ఆయన బొమ్మలతో



టీ-షర్టులు అమ్మడం, మీమ్స్‌లో వాణిజ్య ప్రకటనలు జోడించడం లేదా ఆయన గొంతుతో ం వీడియోలు సృష్టించడం వంటివి చట్టరీత్యా నేరాలుగా పరిగణించబడతాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'దృశ్యం 3' సినిమా కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.